


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 156 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 13 అక్టోబర్ 2025 | వెల : 4/-


# బీసీ రిజర్వేషన్లతో పార్టీల 'రాజకీయం'!




గాల్లో కత్తులు దూయడం... శూన్యంలో యుద్ధాలు చేయడం రాజకీయ పార్టీలు, నేతలకు అలవాటైన విద్యే. తెలంగాణ స్థానిక ఎన్నికల వ్యవహారం ఇప్పుడు దీన్నే నిరూపిస్తోంది. అన్ని పార్టీలకూ తుది పరిణామం ఏమిటన్నది స్పష్టంగా తెలిసినా అందరూ ఏమీ తెలియనట్టే వ్యవహరిస్తూంటారు. ప్రత్యర్థులపై పైచేయికి వ్యూహాలు పన్నుతూంటారు. నిర్దిష్ట గడువులోగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్న తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్వహణపై చిత్తశుద్ధి ఉంటే ఉండవచ్చు కానీ ఎన్నికల్లో అధిపత్యానికి బీసీ రిజర్వేషన్లను 42 శాతం చేయాలని సంకల్పించారు. అసెంబ్లీలో బిల్లులు పాస్ చేశారు.





## రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తాం

- ఈటల, సంజయ్ ఎక్కడ దాక్కున్నారు?'
- బీజేపీ.. బీసీ వ్యతిరేక పార్టీ.. బీజేపీకి బీఆర్ఎస్ తోడైంది
- ఢిల్లీకి వెళ్తాం. సుప్రీంకోర్టు తలుపు తడుతాం
- ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలకు మేం భయపడం
- బీసీ రిజర్వేషన్ల పెంపుపై మా చిత్తశుద్ధి ప్రజలకు తెలుసు
- బీసీ రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టుకు వెళ్తాం

హైదరాబాద్

యూపీఏ హయంలో చారిత్రాత్మక చట్టాలు అమల్లోకి వచ్చాయని చెప్పుకొచ్చారు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్. ఇదే సమయంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్టు తెలిపారు. బీజేపీ.. బీసీ వ్యతిరేక పార్టీ.. బీజేపీకి బీఆర్ఎస్ తోడైంది అంటూ ఘాటు విమర్శలు చేశారు. టీపీసీసీ - మిగతా3లో

## ఎస్సారెస్పీ-2కి ఆర్‌డీఆర్



- ఎస్సారెస్పీ-2కి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు: రేవంత్‌రెడ్డి
- ఆనాటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎస్సారెస్పీ ప్రాజెక్టును తీసుకొచ్చారు
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా ఉన్నా దామోదర్ రెడ్డి.. తన ఆస్తులు నల్గొండ, ఖమ్మం జిల్లా ప్రజలకే అంకితం చేశారు
- భవిష్యత్తులో ఏ అవకాశం వచ్చినా దామోదర్ రెడ్డి కుటుంబానికి గాంధీ కుటుంబం అండగా ఉంటుంది
- కాంగ్రెస్ పార్టీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

సూర్యాపేట

ఎస్సారెస్పీ స్టేజ్ -2పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎస్సారెస్పీ స్టేజ్ -2కి ఆర్డీ ఆర్ స్టేజ్ 2 - గా నామకరణం చేస్తూ 24 గంటల్లోగా జీవో ఇస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంపై పోరాడి ఎస్సారెస్పీ స్టేజ్ -2ని సాధించి గోదావరి జలాలు రప్పించడంలో దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారని ప్రశంసించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా ఉన్నా దామోదర్ రెడ్డి.. తన ఆస్తులు నల్గొండ, ఖమ్మం జిల్లా ప్రజలకే అంకితం చేశారని కొనియాడారు. భవిష్యత్తులో ఏ అవకాశం వచ్చినా దామోదర్ రెడ్డి కుటుంబానికి గాంధీ కుటుంబం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కాంగ్రెస్ పార్టీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటిచ్చారు. ఆదివారం తుంగతుర్తిలో రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాపసభ జరిగింది. దామోదర్‌రెడ్డి - మిగతా3లో



## ప్రధాని మోదీకి ట్రంప్ ఆహ్వానం!

ఈజిప్ట్ వేదికగా ఇజ్రాయెల్ గాజా మధ్య శాంతి ఒప్పందం జరుగబోతుంది.

మరోవైపు.. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్-సిసి సైతం మోదీని ఆహ్వానించినట్లు సమాచారం.



## సైనిక స్థావరాలపై తాలిబన్‌ల దాడి

58 మంది పాక్ సైనికులు మృతి

పాక్ సేనలు అఫ్గాన్ రాజధాని కాబూల్‌పై దాడికి పాల్పడగా.. ప్రతీకారంగా తాలిబన్ సైన్యం పాక్ సైనిక స్థావరాలపై దాడులు

# తెలంగాణ బీసీ జేఏసీ ఏర్పాటు..




## చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య..

## వైస్ చైర్మన్‌గా వీజీ నారగోని

హైదరాబాద్

తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా రాష్ట్రంలోని బీసీ సంఘాల ఆధ్వర్యంలో 'తెలంగాణ బీసీ జేఏసీ' ఏర్పాటు చేశారు. జేఏసీ చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా వీజీ నారగోని వ్యవహరించనున్నారు. బీసీ జేఏసీలో ముఖ్యమైన ఆరుగురితో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల నినాదాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లాలని, రాష్ట్రంలో ఉద్యమం బలంగా జరిగితే.. కేంద్రంపై ప్రభావం పడుతుందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్లలో ఏ అంశం మీద కోర్టు స్టే ఇచ్చిందని కృష్ణయ్య ప్రశ్నించారు. " ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక స్టే ఇవ్వకూడదు. బీసీలకు న్యాయం కోసం ఈ నెల 18న బంద్‌కు పిలుపునిచ్చాం. అన్యాయాన్ని 76 ఏళ్లుగా బీసీలు భరిస్తూ వస్తున్నారు. బీసీలకు అన్యాయంతోపాటు ఇప్పుడు అవమానం జరిగింది. చట్టసభల్లో బిల్లు పెట్టే వరకు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్దాం" అని కృష్ణయ్య పిలుపునిచ్చారు.



## ఎన్డీయే సీట్ల సర్దుబాటు ఖరారు!

భాజపా, జేడీయూకు చెరో 101 స్థానాలు..

లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29 స్థానాల్లో బరి

మిగతా వారికి చెరో ఆరు చోప్పున సీట్లు

# ప్రధాని మోదీకి ట్రంప్ ఆహ్వానం!

**ఢిల్లీ:** ఇజ్రాయెల్, గాజా శాంతి ఒప్పందం నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈజిప్ట వేదికగా సోమవారం జరగబోయే గాజా శాంతి ఒప్పందానికి హాజరు కావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీనిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించారు. ఈ మేరకు జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. వివరాల ప్రకారం.. ఈజిప్ట్ వేదికగా రేపు ఇజ్రాయెల్ గాజా మధ్య శాంతి ఒప్పందం జరుగబోతుంది. ఈ శాంతి ఒప్పందంలో ప్రధాని మోదీ హాజరు కావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆకాంక్షించారు. ఈ మేరకు మోదీకి ఆహ్వానం పంపించారు. మరోవైపు.. ఈజిప్ట అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్–సిసి సైతం మోదీని ఆహ్వానించినట్లు సమాచారం. చివరి నిమిషంలో ప్రధాని మోదీకి ఈ ఆహ్వానం అందినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే.. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన లేదు. మోదీ హాజరుపై ప్రకటన వెలువడాల్సి ఉంది.

**ఇరు పక్షాల అంగీకారం..**

ఇదిలా ఉండగా.. ఆకలి చావులతో రెండేళ్లుగా అల్లాడిపోతున్న కల్లోలిత గాజాలో శాంతి సాధనకు అడుగులుపడిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన



20 సూత్రాల శాంతి ప్రణాళికలో మొదటి దశను వైరిపక్షాలైన ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి. ఈ మేరకు ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేయబోతున్నాయి. రెండేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం పూర్తిగా ముగింపునకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. మొదటి దశ ఒప్పందం ప్రకారం.. గాజాలో దాడులు వెంటనే ఆపేయాలి. తమ చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలను అతిత్వరలో హమాస్ మిలిటెంట్లు విడుదల చేయనున్నారు. అందుకు బదులుగా తమ నిర్బంధంలో ఉన్న పాలస్తీనా ఖైదీలకు ఇజ్రాయెల్ ప్రభుత్వం విముక్తి కల్పించనుంది. అలాగే గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం వెనక్కి వెళ్లిపోనుంది.

**రెండు కీలకమైన అంశాలపై రాని స్పష్టత..**

హమాస్ అధీనంలో 20 మంది బందీలు సజీవంగా ఉన్నట్లు అంచనా. భగవంతుడి దయతో వారందరినీ స్వదేశానికి తీసుకొస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. హమాస్ సైతం స్పందించింది. ఒప్పందం ప్రకారం ఇజ్రాయెల్ సేనలు వెనక్కి వెళ్లిపోవాలని, గాజాలోకి మానవతా సాయాన్ని ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుమతించాలని పేర్కొంది. ఇజ్రాయెల్ బందీలను విడుదల చేస్తామని వెల్లడించింది. అందుకు బదులుగా ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలను తమకు అప్పగించాలని తేల్చిచెప్పింది. మరోవైపు రెండు కీలకమైన అంశాలపై స్పష్టత రాలేదు. ట్రంప్ ప్లాన్ ప్రకారం హమాస్ మిలిటెంట్లు ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలి. గాజా పరిపాలన బాధ్యతలను నిపుణులతో కూడిన స్వతంత్ర పాలస్తీనా అథారిటీకి అప్పగించాలి. ఈ రెండింటిపై హమాస్ గానీ, ఇజ్రాయెల్ గానీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

# ‘బ్లూ స్టార్’కు ఇందిర మూల్యం చెల్లించారు’

**న్యూఢిల్లీ:** ‘నాడు ‘ఆపరేషన్ బ్లూ స్టార్’ చేపట్టాలనేది సమిష్టి నిర్ణయం అని, దీనిలో సైన్యం, పోలీసులు, నిఘా, పౌర సేవా రంగాలు పాల్గొన్నాయని, ఈ విషయంలో ఇందిరా గాంధీని మాత్రమే నిందించలేమని’ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పి చిదంబరం అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలిలో జరిగిన ఒక సాహిత్య కార్యక్రమంలో పాల్గొన్న చిదంబరం 1984 నాటి ‘ఆపరేషన్ బ్లూ స్టార్’ను ప్రస్తావించారు. పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయాన్ని తిరిగి దక్కించుకునేందుకు అనుసరించిన తప్పుడు మార్గంగా ‘ఆపరేషన్ బ్లూ స్టార్’ను ఆయన అభివర్ణించారు. అయితే నాటి సమిష్టి నిర్ణయానికి ప్రధాని ఇందిరా గాంధీ అంతిమ మూల్యం చెల్లించారని చిదంబరం పేర్కొన్నారు. 1984, జూన్‌లో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలో చొరబడిన ఉగ్రవాదులను తరిమికొట్టేందుకు ఉద్దేశించిన ఆర్మీ ఆపరేషన్ గురించి చిదంబరం మాట్లాడుతూ నాటి నిర్ణయం ఇందిరా గాంధీ



ఒక్కరే తీసుకోలేదని స్పష్టం చేశారు. అది సమిష్టి నిర్ణయం అని, ఇందిగా గాంధీని మాత్రమే నిందించలేమని అన్నారు. అనంతరం పంజాబ్ గురించి మాట్లాడిన ఆయన ఖలిస్తాన్ ఉద్యమాలు చాలావరకు తగ్గిపోయాయని, ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులే ఆ రాష్ట్రానికి ప్రధాన సమస్యగా మారాయని అభిప్రాయపడ్డారు.

**ఆపరేషన్ బ్లూ స్టార్**

ఆపరేషన్ బ్లూ స్టార్ 1994, జూన్ ఒకటి నుండి జూన్ ఎనిమిది వరకు జరిగింది. అకల్ తఖ్త్, స్వర్ణ దేవాలయ సముదాయంలోకి చొరబడిన భింద్రాన్‌వాలే, అతని అనుచరులను తరిమికొట్టేందుకు ప్రభుత్వం ఆర్మీ ఆపరేషన్ ప్రారంభించింది. దీనిలో ట్యాంకులు, భారీ ఫిరంగిదళాలు పాల్గొన్నాయి. ఫలితంగా ఉగ్రవాదులు, సైనికులు, పౌరులు మరణించారు. ఈ దాడి సిక్కు సమాజాన్ని తీవ్రంగా బాధించింది. వారిలో ఆగ్రహాన్ని రేకెత్తించింది. 1984 అక్టోబర్ 31న, స్వర్ణ దేవాలయంపై జరిగిన దాడికి ప్రతీకారంగా ఇందిరా గాంధీని ఆమె సిక్కు అంగరక్షకులు హత్య చేశారు. అనంతరం భారతదేశం అంతటా సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగాయి.

# ఎన్డీయేే సీట్ల సర్దుబాటు ఖరారు!

బిహార్ ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైంది. భాజపా, జేడీయూలు చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29 స్థానాల్లో బరిలో దిగనుంది. కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం)కు, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహా సారథ్యంలోని రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం)కు ఆరు చొప్పున సీట్లు కేటాయించారు. కూటమి పక్షాలు ఈ సర్దుబాటును స్వాగతించాయని కేంద్రమంత్రి, భాజపా సీనియర్ నేత ధర్మేంద్ర ప్రధాన్ ట్వీట్ చేశారు. బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

**జేడీయూలో అభ్యర్థుల ఎంపిక కొలిక్కి**

బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార ఎన్డీయే కూటమి పార్టీల్లో సీట్ల కేటాయింపుపై ముమ్మర కసరత్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌కు చెందిన జేడీయూలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. 243 స్థానాల్లో 103 స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉందని ఓ సీనియర్ నేత వెల్లడించారు. దాదాపు అన్ని స్థానాల్లో అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయని, నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని చెప్పారు. వారి పేర్లను మాత్రం ఆయన వెల్లడించలేదు. “జేడీయూ పోటీ చేయనున్న స్థానాలను ఇప్పటికే గుర్తించాం. ఆయా అభ్యర్థులను కూడా ఖరారు చేశాం. పనితీరు బాగాలేని నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను కొత్తవారితో భర్తీ చేసే అవకాశం ఉంది. భాగల్‌పుర్, నవాదా, బంకా జిల్లాల్లో ఈ నాలుగు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అదేవిధంగా గత వారం మా ఎమ్మెల్యే సంజీవ్ కుమార్



ఆర్జేడీలో చేరిన నేపథ్యంలో.. పర్బత్తా స్థానంలో కొత్త అభ్యర్థిని బరిలోకి దింపనున్నాం. మాజీ ఎమ్మెల్యే బీమా భారతీ ప్రతిపక్ష పార్టీలో చేరడంతో.. రుపౌలిలోనూ ఇదే విధంగా ముందుకెళ్తాం” అని జేడీయూ నేత తెలిపారు. సీట్ల సర్దుబాటుపై ఎన్డీయే సీనియర్ నేతలు తగిన సమయంలో అధికారిక ప్రకటన చేస్తారన్నారు. ఎన్డీయేలో సీట్ల సర్దుబాటుపై ఆదివారం ప్రకటన వెలువడుతుందని భాజపా బిహార్‌శాఖ అధ్యక్షుడు దిలీప్ జైశ్వాల్ ఇప్పటికే తెలిపారు. కాషాయ పార్టీ 102 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో 22 సీట్లలో పోటీ చేసిన లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్.. ఈసారి అదనపు సీట్లు అడుగుతున్నారు. ఎన్డీయేలోని హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం), రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్ఎల్ఎం)లకు గౌరవప్రదమైన సంఖ్యలో సీట్ల కేటాయింపు ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో వచ్చే నెల 6, 11వ తేదీల్లో రెండు దశల్లో పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# తొక్కిసలాట ఘటనకు సెంథిల్ బాలాజీనే కారణం

**కరూర్:** టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ర్యాలీలో తొక్కిసలాట ఘటనపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రమాదానికి డీఎంకే పార్టీ మాజీ నేత సెంథిల్ బాలాజీనే కారణమని ఆరోపించారు. పథకం ప్రకారం ఆయన ఆ ప్రాంతంలో తొక్కిసలాట జరిగేలా చేశారని..అందువల్లే 41మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. 2026 ఏప్రిల్ 20 తర్వాత తమిళనాడులో ఎన్డీఏ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని.. జనవరి 10 తర్వాత ఈ కూటమి ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటారని నాగేంద్రన్ పేర్కొన్నారు. డీఎంకే కూటమిలోని రెండు వర్గాలకు మధ్య విభేదాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ వాటితో కలిసి పోటీ చేస్తుందా లేదా అనే విషయంపై స్పష్టత లేదన్నారు. డీఎంకే అధికారం చేపట్టి నాలుగేళ్లైనా రాష్ట్ర అభివృద్ధి కోసం ఏమీ చేయని ముఖ్యమంత్రి స్టాలిన్ తన కొడుకును మాత్రం ఉప ముఖ్యమంత్రిని చేశారన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటన్నిటికి ఆయన జవాబు చెప్పాల్సి ఉంటుందన్నారు. కాగా కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత తమిళనాడు రాజకీయాలు మరింత వేడెక్కాయి.




ఒకవైపు విజయ్‌తో కూటమి చర్చలకు అన్నాడీఎంకే ప్రయత్నాలు చేస్తుండగా.. మరోవైపు టీవీకేతో పొత్తు పెట్టుకోవాలంటూ కాంగ్రెస్‌లోని ఓ వర్గం పట్టుపడుతున్నాయి. ఈ క్రమంలోనే అన్నాడీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు ఎడప్పాడి పళనిసామి ఈనెల 6న విజయ్‌కు ఫోన్ చేసి.. ఆయనకు పూర్తి మద్దతు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో కూటమి ఏర్పాటు చర్చలకు ఆహ్వానం పలికినట్లు తెలుస్తోంది. ఉమ్మడి శత్రువైన డీఎంకేను వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఓడించడానికి ఒకే కూటమి గొడుగు కిందకు రావడం అవసరమని సూచించగా పొంగల్ తర్వాత తన వైఖరి వెల్లడిస్తానని విజయ్ సమాధానం ఇచ్చారని సమాచారం. మరోవైపు కేంద్రమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విజయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

## సైనిక స్థావరాలపై తాలిబన్ల దాడి..



అఫ్గానిస్థాన్ పాకిస్థాన్ దేశాల సరిహద్దుల్లో ఇరు దేశాల సైన్యాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పాక్ సేనలు అఫ్గాన్ రాజధాని కాబూల్ పై దాడికి పాల్పడగా.. ప్రతీకారంగా తాలిబన్ సైన్యం పాక్ సైనిక స్థావరాలపై దాడులు చేసింది. ఈ క్రమంలో తాము 58 మంది పాకిస్థానీ సైనికులను మట్టుబెట్టామని అఫ్గానిస్థాన్ ప్రకటించింది. ఇస్లామాబాద్ పదేపదే తమ సరిహద్దుల ఉల్లంఘనలకు పాల్పడిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు అఫ్గాన్ తెలిపింది. ఐసిస్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించొద్దని పాకిస్థాన్‌ను హెచ్చరించింది. కాబుల్‌తోపాటు ఓ మార్కెట్‌పై పాకిస్థాన్ బాంబు దాడులు చేసిందని ఇటీవల అఫ్గానిస్థాన్ ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే పాక్ దళాలే లక్ష్యంగా ప్రతీకార దాడులు చేపట్టినట్లు తెలిపింది. తమ సేనలు పొరుగు దేశానికి చెందిన 25 ఆర్మీ పోస్టులను స్వాధీనం చేసుకున్నాయని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ వెల్లడించారు. 58 మంది పాక్ సైనికులు మృతి చెందారని, మరో 30 మంది గాయపడ్డారని చెప్పారు. ఇటీవల కాబుల్‌లో భారీ పేలుళు చోటుచేసుకున్నాయి. తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్ చీఫ్ నూర్ వాలి మెహ్సూద్ స్థావరం లక్ష్యంగా పాక్ యుద్ధవిమానాలు దాడి చేశాయి.

## ‘ఆమె’ అర్ధరాత్రి ఎందుకు బయటకు వెళ్లింది?: సీఎం మమత



**దుర్గాపూర్:** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో శుక్రవారం(అక్టోబర్ 10వ తేదీ) వైద్య విద్యార్థినిపై అత్యాచారం జరగడంపై సీఎం మమతా బెనర్జీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది తనను షాక్‌కు గురి చేసిందని, బాధితురాలికి కచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అర్ధరాత్రి సమయంలో సదరు విద్యా?ర్థిని బయటకు వెళ్లడాన్ని మీడియా సమక్షంలో ప్రశ్నించారు. అసలు అర్ధరాత్రి సమయంలో విద్యార్థులను క్యాంపస్ నుండి బయటకు ఎలా వెళ్లనిచ్చారని సీఎం మమతా నిలదీశారు. ఇది సరైన పద్ధతి కాదని, విద్యార్థుల క్యాంపస్‌లు అనేవి అత్యంత పకడ్బందీగా ఉండాలని ఆమె అన్నారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితుల్ని పట్టుకుని శిక్ష పడేలా చేస్తామన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న కాలేజీల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. నైట్ కల్చర్‌కు విద్యార్థుల్ని దూరంగా ఉంచాల్సిన బాధ్యత ఆయా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలేదేనని స్పష్టం చేశారు. మరో వైపు విద్యార్థులు కూడా తమని తాము రక్షించుకునేలా ఉండాలన్నారు. ఆ విద్యార్థిని కాలేజ్ క్యాంపస్ నుండి రాత్రి గం. 12,30 ని.లకు ఎలా వచ్చిందన్నారు మమత. ఇ?క బీజేపీ అధికారంలో ఉన్న ఒడిశాలో కూడా ఈ తరహా ఘటనలు జరుగుతున్నాయని, అలాగే ఉత్తర్‌ప్రదేశ్, మణిపూర్, బీహార్‌లలో కూడా అత్యాచార ఘటనలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

**మమత వ్యాఖ్యలపై బీజేపీ ఫైర్**

మమతా బెనర్జీ వ్యాఖ్యలపై రాష్ట్ర బీజేపీ మండిపడింది. బాధితురాలికి న్యాయం జరిగే మాటను పక్కను పెట్టి, వేరే ఏవో కథలు సీఎం మమత చెబుతున్నారని ధ్వజమెత్తింది. ఆర్జీ కర్, సందేశ్‌ఖలి తర్వాత, ఇప్పుడు ఈ భయంకరమైన కేసులో న్యాయం కాకుండా, ఆమె బాధితురాలినే నిందిస్తున్నారు’ అని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ‘ఎక్స్’ వేదికగా విమర్శించారు. అంటే సీఎం మమతా చెప్పేది ఏమిటంటే.. అర్ధరాత్రి అమ్మాయిలనేవారు బయటకు వెళ్లొదని చెబుతున్నారా? అంటూ ప్రశ్నించారు.

## అవసరమైతే పోరాటానికి వెనుకాడం.. ట్రంప్ టారిఫ్స్‌పై చైనా కామెంట్

చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంపై చైనా స్పందించింది. సుంకాల విషయంలో అగ్రరాజ్యం ద్వంద్వ ప్రమాణాలను అనుసరిస్తోందని చైనా వాణిజ్య మంత్రిత్వ



శాఖ దుయ్యబట్టింది. ట్రంప్ తీసుకుంటున్న ఈ చర్యలు తమ దేశ ప్రయోజనాలకు తీవ్ర హాని కలిగిస్తాయని చైనా ఆందోళన వ్యక్తం చేసింది. సాధారణంగా తాము ఎవరితోనూ ఘర్షణలకు దిగమని, అవసరం వస్తే మాత్రం పోరాడటానికి వెనకాడమని స్పష్టంచేసింది. మాపై చర్యలకు ప్రతి చర్యలు కూడా ఉంటాయని తెలిపింది. ట్రంప్ ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలు ఇరుదేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య చర్చల వాతావరణాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నది. అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంపై ట్రంప్ ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ సుంకాలు విధిస్తానంటూ హెచ్చరికలు చేశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీని రద్దు చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగారు. ఈ క్రమంలోనే చైనా దిగుమతులపై అదనంగా మరో 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. నవంబర్ 1 నుంచి ఇవి అమలులోకి వస్తాయని తెలిపారు. చైనా తీసుకునే చర్యలను బట్టి తదుపరి చర్యలు ఉంటాయన్నారు. గతంలోనూ అమెరికా–చైనాల మధ్య వాణిజ్యయుద్ధం జరిగింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య జరిగిన వాణిజ్య వివాదం తగ్గించే లక్ష్యంగా ఇరుదేశాల మధ్య చర్చలు కూడా జరిగాయి. ఈ విధంగా ట్రేడ్ డీల్‌కు ఇరుదేశాలు అంగీకరించినప్పటికీ అది కొలిక్కి రాలేదు. ఈ క్రమంలో తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి.

# బీసీ రిజర్వేషన్లతో పార్టీల 'రాజకీయం'!

గాల్లో కత్తులు దూయడం... శూన్యంలో యుద్ధాలు చేయడం రాజకీయ పార్టీలు, నేతలకు అలవాటైన విద్యే. తెలంగాణ స్థానిక ఎన్నికల వ్యవహారం ఇప్పుడు దీన్నే నిరూపిస్తోంది. అన్ని పార్టీలకూ తుది పరిణామం ఏమిటన్నది స్పష్టంగా తెలిసినా అందరూ ఏమీ తెలియనట్టే వ్యవహరిస్తూంటారు. ప్రత్యర్థులపై పైచేయికి వ్యూహాలు పన్నుతూంటారు. నిర్దిష్ట గడువులోగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్న తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్వహణపై చిత్తశుద్ధి ఉంటే ఉండవచ్చు కానీ ఎన్నికల్లో అధిపత్యానికి బీసీ రిజర్వేషన్లను 42 శాతం చేయాలని సంకల్పించారు. అసెంబ్లీలో బిల్లులు పాస్ చేశారు. కులగణన చేపట్టి రాష్ట్రంలో బీసీలు 56 శాతమని తేల్చారు కూడా. అయితే స్థానిక ఎన్నికల్లో మాత్రం 42 శాతాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకున్నారు. జనాభాను బట్టి రిజర్వేషన్లు ఉండాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. స్థానిక సంస్థలలోనే కాక, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ బీసీలకురిజర్వేషన్లు ఉండాలని కొన్ని రాష్ట్రాల శాసన సభలు తీర్మానాలు కూడా చేశాయి. కాని సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రిజర్వేషన్లు ఏభై శాతానికి మించే వీలు లేదు. అయినా తాము అనుకున్న రిజర్వేషన్ల శాతంతో స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తలపెట్టింది.

ఎవరైనా కోర్టుకు వెళితే అది ఆగిపోతుందని అంతా అనుకున్నదే. అయినా ఎవరికి వారు 42 శాతం రిజర్వేషన్ల అంశానికి మద్దతు ఇస్తూనే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ గడిపారు. అసెంబ్లీలో కూడా అన్ని పార్టీలు ఈ బిల్లుకు మద్దతు ఇచ్చాయి. కాని రాష్ట్ర గవర్నర్ ఈ బిల్లుకు ఆమోదం తెలపలేదు. గవర్నర్ సకాలంలో ఆమోదం తెలపకపోతే ఆ బిల్లు ఓకే అయిపోయినట్లే అని కొంతకాలం క్రితం సుప్రీంకోర్టు చేసిన ఒక వ్యాఖ్య ఆధారంగా తాము 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తదుపరి జీవో ఇచ్చింది. అయినా ఎవరికి ఇది అమలు అవుతుందన్న నమ్మకం లేదు. కాని ఎవరూ దీనికి అభ్యంతరం చెప్పలేదు. కాకపోతే ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ వచ్చారు. ఆ జీవోపై హైకోర్టులో ఊహించినట్లే స్టే వచ్చింది. ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఈలోగానే రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇవ్వడం మరో చిత్రం. తదుపరి హైకోర్టు ఆదేశాలను పాటిస్తామని ప్రకటించింది.

ఈ గేమ్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా భాగస్వామి అవడం గమనించదగిన అంశమే. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదని కమిషన్‌కు తెలియదా? తీర్పు వచ్చాక మళ్లీ రాజకీయ పార్టీలు ఒకదానిపై మరొకటి విమర్శలు కొనసాగించాయి. రిజర్వేషన్ల జీవోను బీజేపీ, బీఆర్ఎస్‌లే అడ్డుకున్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. కోర్టులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదని ప్రశ్నించారు. కాగా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ మోసం చేసిందని, దీనిని ప్రజలలో ఎండగట్టాలని బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కె.చంద్రశేఖరరావు కేడర్‌కు పిలుపు ఇచ్చారు. ఇక బీజేపీ నేత, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ తీరుతోనే జీవోపై హైకోర్టు స్టే ఇచ్చిందని విమర్శించారు. రిజర్వేషన్లపై ప్రభుత్వ తీరు దురదృష్టకరం అని ఆయన అన్నారు. ఈ మూడు పార్టీలలో ఏ ఒక్కరికైనా చిత్తశుద్ధి ఉందా అన్న ప్రశ్న వస్తే సమాధానం దొరకదు. ఎవరికి వారు అడ్వాంటేజ్ తమకు రావడానికే గేమ్ ఆడారు తప్ప ఇంకొకటి కాదనిపిస్తుంది.

ఈ వ్యవహారానికి ముందు ప్రతిపక్ష పార్టీలు ఎన్నికలు జరపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందని ఆరోపించేవి. రిజర్వేషన్ల అంశంపై మాత్రం అందరూ పోటాపోటీగా 42 శాతానికి మద్దతిస్తున్నట్లు మాట్లాడేవారు. కేసీఆర్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను పెంచేందుకు ప్రయత్నిస్తే రేవంత్ విమర్శించేవారని, రిజర్వేషన్ల అధికారం రాష్ట్రాలకు ఇవ్వడం నేరమన్నారని బీఆర్ఎస్ ఇప్పుడు గుర్తు చేస్తోంది. కాని ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక తనే రిజర్వేషన్లు పెంచడానికి రాష్ట్రానికి అధికారం ఉందన్నట్లుగా బిల్లు ఆమోదింప చేశారు. జీవో కూడా ఇచ్చేశారు. మరి ఇది చెల్లదన్న సంగతి ఆయనకు తెలియదా? అంటే ఏమి చెబుతాం? కులగణనతో చాలా మార్పులు వచ్చేస్తాయని కాంగ్రెస్ ప్రచారం చేసింది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ మోడల్ అంటూ దేశంలో పర్యటిస్తూ ఉపన్యాసాలు ఇచ్చారు. తీరా ఇప్పుడు వ్యవహారం మొదటికి వచ్చినట్లయింది.

తమిళనాడులో మాదిరి షెడ్యూల్ 9 లో చేర్చితేనే రిజర్వేషన్ లకు చట్టబద్ధత వస్తుందని తెలిసినా, కాంగ్రెస్ పార్టీ బీహారు ఎన్నికలలో ప్రయోజనం కోసం ఈ డ్రామా ఆడిందని మాజీ స్పీకర్, శాసనమండలిలో విపక్ష నేత మధుసూదనాచారి వ్యాఖ్యానించారు. అయితే తమకు ఉన్న చిత్తశుద్ధిని రుజువు చేసుకున్నామని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. ఒకవేళ హైకోర్టులో స్టే రాకపోతే స్థానిక ఎన్నికలు జరిగిపోయేవి. అప్పుడు కాంగ్రెస్ పార్టీ బీసీలకు రిజర్వేషన్లు పెంచిన పార్టీగా పేరు తెచ్చుకునేది. ఎన్నికల మానిఫెస్టోలో చెప్పిన విధంగా చేశామనిపించుకునేది. గతంలో కేసీఆర్ కూడా ముస్లింలకు, గిరిజనులకు రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించి ప్రచారం చేశారు.. ఇది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అంశమని ఆయనకు కూడా తెలుసు. అయినా కావాలని అప్పట్లో అలా చేశారన్నది నిష్ఠుర సత్యం. అలాగే ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే పంథాలో సాగిందని చెప్పాలి. బీజేపీ కూడా తన వంతు పాత్ర పోషించి, అటు పాము చావకుండా, ఇటు కర్ర విరగకుండా వ్యవహరించింది. కేంద్రం మీదకు నెట్టాలని కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రం మీద నెపం ఉండేలా బీజేపీ ప్రయత్నం చేశాయి. జాతీయ పార్టీలను తప్పుపట్టి తానే బీసీలకు అనుకూలం అన్న భావన కలిగించాలని బీఆర్ఎస్ యత్నం.వాస్తవానికి ఈ మూడు పార్టీలు తెలంగాణ ప్రజలను మభ్య పెట్టడానికి శక్తివంచన లేకుండా కృషి చేశాయానిపిస్తుంది. కాకపోతే అమాయక గ్రామీణులు కొందరు నిజంగానే ఎన్నికలు వచ్చేస్తాయనుకుని తమ చేతులు కాల్చుకున్నారట. దసరా నాడు వారికి ఎన్నికల ఖర్చు రూపేణా బాగానే చేతి చమురు వదిలిందట. ఏతావాతా ఈ రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ పార్టీలు ఒక డ్రామాగా మార్చడం దురదృష్టకరం. తమకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు రావాలని ఆకాంక్షిస్తున్న బీసీ వర్గాలకు మరోసారి నిరాశే ఎదురైంది.తాజాగా సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అక్కడ ఇందుకు భిన్నంగా తీర్పు వస్తే ఒక చరిత్రే అవుతుంది. ఏమి జరుగుతుందో చూద్దాం.

## ఎస్సారెస్పీ-2కి ఆర్‌డీఆర్

-మొదటిపేజీ తరువాయి

సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి దామోదర్ రెడ్డి సేవలని నేతలు గుర్తుకుచేసుకున్నారు.

## 'రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్తాం

-మొదటిపేజీ తరువాయి

చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ..'రేపు ఢిల్లీకి వెళ్తాం. సుప్రీంకోర్టు తలుపు తడుతాం. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలకు మేం భయపడం. బీసీ రిజర్వేషన్ల పెంపుపై మా చిత్తశుద్ధి ప్రజలకు తెలుసు. బీసీ రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టుకు వెళ్తాం. బీసీ రిజర్వేషన్ల పెంపుపై వెనక్కి తగ్గేది లేదు. బిల్లులు గవర్నర్ దగ్గర పెండింగులో ఉన్నాయి. ప్రధాని దగ్గరికి వెళ్ళి బీజేపీ నాయకులు ఎందుకు అడగడం లేదు?. బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిస్తే మద్దతు ఇస్తాం. బీసీ సంఘాలు ధర్నా చేసినప్పుడు ఈటల, సంజయ్ ఎక్కడ దాక్కున్నారు?. బీజేపీ నరనరాన బీసీ వ్యతిరేక పార్టీ. బీజేపీకి బీఆర్ఎస్ తోడైంది అంటూ విమర్శలు చేశారు.

అలాగే,

**ఆర్టీఐపై కీలక వ్యాఖ్యలు..**

నేటితో ఆర్టీఐ చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్ళు అయిన సందర్భంగా స్పందిస్తూ.. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం, సోనియా గాంధీ దూరదృష్టి నాయకత్వంలో చారిత్రాత్మక సమాచార హక్కు చట్టం 2005 అక్టోబర్ 12న అమలులోకి వచ్చింది. దేశ చరిత్రలో ఆర్టీఐ చారిత్రాత్మక నిర్ణయం. ప్రజలకి వాస్తవాలను తెలుసుకోవడానికి మహత్తర అవకాశం ఆర్టీఐ ద్వారా కల్పించారు. ప్రజలకు ఆర్టీఐ జీవన రేఖగా మారింది. ఈ చట్టం ప్రజలకు ప్రభుత్వ విభాగాల సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చి పాలనలో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానాన్ని తీసుకొచ్చింది. 2014 నుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్టీఐకి తూట్లు పొడుస్తోంది. 2019 సవరణలతో సమాచారం కమిషన్ల స్వతంత్రతను బలహీనపరిచాయి. కమిషనర్ల పదవీకాలం (5 సంవత్సరాలు), సేవా షరతులను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించేలా మార్పులు జరిగాయి. స్వయం ప్రతిపత్తితో నిర్వహించే ఆర్టీఐ కమిషనర్లు కేంద్రం ఒత్తిడిలకు తల్లోగే పరిస్థితి ఏర్పడింది. కేంద్ర సమాచారం కమిషన్ ప్రస్తుతం 11 పోస్టులకు బదులుగా కేవలం ఇద్దరు కమిషనర్లతోనే పనిచేస్తోంది. 2025 సెప్టెంబర్ తర్వాత చీఫ్ కమిషనర్ పదవి కూడా ఖాళీగా ఉంటుంది. ఇంతకంటే దుర్మార్గం లేదు. కేంద్రంలోని ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వ అవినీతిని బహిర్గతం చేసే వ్యక్తులు రక్షణ లేకుండా దాడులు, వేధింపులకు గురవుతున్నారు. 2019 సవరణలను రద్దు చేసి కమిషన్ల స్వతంత్రతను పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర కమిషన్లలో ఖాళీలను తక్షణమే పారదర్శకంగా భర్తీ చేయాలి. కమిషన్ల పనితీరుపై నిర్దిష్ట ప్రమాణాలు, ప్రజా నివేదికలు తప్పనిసరి చేయాలి' అని డిమాండ్ చేశారు.

# జేబులు గుల్లా?

**కరీంనగర్ :** స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో రాష్ట్ర సర్కారు చేసిన ఆగానికి ఆశావహుల జేబులు గుల్లా అయ్యాయి. ఒకరిద్దరు కాదు.. ప్రభుత్వం చూపించిన అశల సవ్వడిలో ఓలయాడిన వేలాది మంది తమ సామర్థ్యానికి మించి ఇప్పటికే ఖర్చు చేశారు. నామినేషన్లు, ఎన్నికలకు అత్యంత తక్కువ సమయం ఉండడంతో.. రిజర్వేషన్లు ఖరారు కాగానే.. ఖర్చుల ప్రక్రియ ఆరంభం కాగా.. ఇందులో ఎక్కువ శాతం బీసీ అభ్యర్థులే నష్టపోయారు. ప్రభుత్వ మాటలు నమ్మి.. 42 శాతం రిజర్వేషన్ల ద్వారా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలన్న ఆకాంక్షతో బరిలోకి దిగిన బీసీ అభ్యర్థులు పెట్టిన ఖర్చులు ఇప్పుడు బూడిదలో పోసిన పన్నీరు అయిందన్న ఆవేదన వ్యక్తమవుతోంది.

"జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు భయపడాల్సిన పనిలేదు. 2029 వరకు మీకు మీ పదవులకు ఎలాంటి ఢోకా లేదు. నిరభ్యంతరంగా మీరు నామినేషన్ వేసి పోటీ చేయొచ్చు. మీ పదవీ కాలం ముగిసేవరకు పూర్తి గ్యారెంటీ ప్రజా ప్రభుత్వమే తీసుకుంటుంది. కాబట్టి, నిరభ్యంతరంగా పోటీ చేసి గెలవండి. గెలిచిన అభ్యర్థుల పదవులు మధ్యలోనే పోతాయని అపోజిషన్‌కు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేసే దుష్ప్రచారాలు నమ్మొద్దు. నిస్సందేహంగా మీరు పోటీ చేయండి. పోటీ చేసి గెలిచిన అభ్యర్థులకు ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సపోర్ట్ పుష్కలంగా ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో సర్కారు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ఒకవైపు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోపై హైకోర్టులో కేసు నడుస్తుండగానే.. రిజర్వేషన్లు ప్రకటించడం, నోటిఫికేషన్ జారీచేయడం.. అక్కడితో ఆగకుండా.. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి తేదీలను ప్రకటించడం వంటివి ఆగమేఘాల మీద చేసింది. ఆర్భాటపు ప్రచారం చేసి.. ఎన్నికలు ఖచ్చితంగా జరుగుతాయనే భ్రమను కల్పించింది. ఒకవైపు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవో న్యాయస్థానాల్లో నిలువదని న్యాయనిపుణులు, రాజకీయ విశ్లేషకులు పదేపదే చెప్పినా.. హస్తం పార్టీ, ప్రభుత్వం ఏమాత్రం వినకుండా.. ముందుకు వెళ్లింది. ఆ మేరకు.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడుత నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఈనెల 9 నుంచి 11 వరకు అలాగే, రెండో విడుత ఈ నెల 13 నుంచి 15 వరకు స్వీకరించడానికి ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఆ మేరకు మొదటి విడుత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఈ నెల 23న, రెండో విడుత 27న జరిగేలా షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అలాగే, గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడుతల్లో నిర్వహించాలని నిర్ణయించగా.. ఉమ్మడి జిల్లాలో మొదటి విడుత నామినేషన్లు ఈ నెల 17 నుంచి 10 వరకు, రెండో విడుత ఈ నెల 21 నుంచి 23 వరకు, మూడో విడుత ఈ నెల 25 నుంచి 27 వరకు స్వీకరించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. సర్పంచ్ మొదటి విడుత ఎన్నికలు ఈ నెల 23న, రెండో విడుత 27న, మూడో విడుత వచ్చేనెల 8న నిర్వహించేందుకు ఆదేశాలు విడుదలయ్యాయి. ముందుగా రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రకటనలు జారీ కావడం.. ఆ వెంటే షెడ్యూల్ విడుదల కావడం.. ఆ తదుపరి నోటిఫికేషన్ విడుదల చేసి, ఎన్నికలు ఎట్టి పరిస్థితుల్లో వాయిదా పడే ప్రసక్తే లేదన్నట్లుగా ప్రభుత్వం హడావుడి చేసింది.




**జేబులు గుల్లా?**

కోర్టులో కేసు ఉందని తెలిసినా.. సర్కారు చేసిన హడావుడిని నమ్మిన ఆశావహులు వారి ప్రయత్నాల్లో మునిగితేలారు. ఆ మేరకు భారీగా ఖర్చులు పెట్టుకున్నారు. నిజానికి ఎన్నికల నిబంధనల ప్రకారం చూస్తే.. జడ్పీటీసీ రూ.4 లక్షలు, ఎంపీటీసీ రూ.1.5 లక్షల లోపు ఖర్చుచేయాలి. సర్పంచ్, వార్డు మెంబర్ల విషయానికొస్తే.. ఐదు వేలకు పైగా జనాభా ఉంటే.. అక్కడ సర్పంచ్ బరిలో ఉండేవారు రూ.2.5 లక్షలు, వార్డుమెంబర్ రూ.50 వేలు.. అలాగే, ఐదు వేల లోపు జనాభా ఉంటే సర్పంచ్‌కు రూ.1.5 లక్షలు, వార్డుమెంబర్‌కు రూ.30 వేలు ఖర్చు చేయాలని ఎన్నికల సంఘం విడుదల చేసిన నిబంధనల్లో పేర్కొంది. సాధారణంగా ఏ ఎన్నికలైనా.. ఎన్నికల సంఘం సూచించే ఖర్చుకు%ొ% అభ్యర్థులు క్షేత్రస్థాయిలో పెట్టే డబ్బులకు ఏమాత్రం పొంతన ఉండదన్న విషయం అందరికీ తెలిసిందే. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు కూడా వీటికి అతీతం కాదు. ఒక్కో జడ్పీటీసీ ఆయా మండలాల్లో ఉన్న పోటీని బట్టి.. దాదాపు రూ.20 నుంచి రూ.50 లక్షల వరకు, అలాగే ఎంపీటీసీలు రూ.10 నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు పెడుతారు. సర్పంచ్‌లు అయితే.. మేజర్ పంచాయతీల్లో రూ.20 నుంచి రూ.30 లక్షలు, మైనర్ పంచాయతీలైతే రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చులు పెడుతారు. నిజానికి కొన్ని స్థానాల్లో ఇంతకు రెండింతలు కూడా అయ్యే అవకాశాలుంటాయి. ఎన్నికలు పక్కాగా జరిగి తీరుతాయని, 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసి తీరుతామంటూ.. ప్రభుత్వం, మంత్రులు పదే పదే చెప్పడం.. మరోవైపు రిజర్వేషన్లు ప్రకటించి షెడ్యూల్ విడుదల చేయడంతో చాలా చోట్ల పోటీదారులు రంగంలోకిదిగారు. తమ గెలుపుకోసం.. గ్రామాలు, మండలాల్లో దావతులు ఏర్పాటు చేశారు. పలు సంఘాలకు డబ్బులు ఇచ్చి తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు ఆరంభించారు. పోటీదారుల్లో కొంత మంది ఒక అడుగు ముందుకేసి.. పలువురు నాయకుల నుంచి మద్దతు కూడగట్టేందుకు.. అలాగే, సదరు నాయకులు పోటీచేయకుండా ఉండేందుకు ఒప్పందాలు చేసుకొని కొంత ముట్టజెప్పారు. ఇంకా మిగిలిన మొత్తానికి కొన్ని చోట్ల ప్రామిసరీ నోట్, మరికొన్ని చోట్ల పెద్ద మనుషుల మధ్య ఒప్పందాలు, ఇంకొన్ని చోట్ల చెక్కులు కూడా ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. చాలా ప్రాంతాల్లో ఆశావహులు ఇప్పటికే.. 50 శాతం నుంచి 60 శాతం డబ్బు ఖర్చు చేశారన్న చర్చ సాగుతోంది. తీరా ఎన్నికలు వాయిదా పడడంతో.. జేబులు గుల్లా చేసుకున్న నాయకులు ఆందోళన చెందుతున్నారు.

**బీసీలే ఎక్కువ బాధితులు?**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సర్కారు జీవో ఇచ్చిన విషయం తెలిసిందే. గతంలో 23 శాతం ఉండేది. ప్రభుత్వం తాజాగా, ఇచ్చిన జీవో ప్రకారం చూస్తే 19 శాతం రిజర్వేషన్ పెరిగింది. దీంతోపాటు.. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ.. జడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీలను ప్రకటించింది. దీంతో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా బీసీ నాయకులు ఆయా స్థానాల్లో రంగంలోకి దిగారు. నిజానికి ప్రభుత్వం ఇచ్చిన జీవో న్యాయస్థానాల్లో చెల్లదని, అది చట్టబద్ధంగా లేదంటూ.. న్యాయనిపుణులు, రాజకీయ విశ్లేషకులు చెప్పినా.. వాటిని మరిపించే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఆర్భాటపు ప్రచారం చేశారు. రిజర్వేషన్లపై జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని, ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని, నిర్భయంగా పోటీ చేయాలని, మీ పోస్టులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది గ్యారెంటీ అంటూ.. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు వారివారి వాట్సాప్ గ్రూపుల్లో మెస్సేజ్‌లు పెట్టి.. ఎన్నికల రంగంలోకి దిగే విధంగా ప్రేరేపించారు. మరో అడుగు ముందుకు వేసి.. ఏకంగా కొంత మందికి ఫోన్‌చేసి పోటీచేయాలని సూచించారు. దీంతో.. సదరు ఆశావహులు రంగంలోకి దిగి ఖర్చులు పెట్టుకున్నారు. తీరా ఇప్పుడు చూస్తే.. ఎన్నికలు వాయిదా పడ్డాయి. అలాగే.. 42 శాతం జీవో నిలిచే పరిస్థితి లేదు కాబట్టి.. ప్రస్తుతం ప్రకటించిన వాటిలో ఎస్సీ, ఎస్టీ మినహా బీసీల రిజర్వేషన్లు భారీగా మారే అవకాశం ఉంది. అదే జరిగి రిజర్వేషన్లు కలిసి రాకపోతే ఇప్పటి వరకు చేసిన ఖర్చులు, పెట్టిన డబ్బులకు ఎవరు బాధ్యత వహిస్తారన్న చర్చ ప్రస్తుతం హస్తం పార్టీలో నడుస్తోంది. ఒకవేళ రిజర్వేషన్లు కలిసి వచ్చినా.. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి ఉందని, అప్పటి వరకు.. మళ్లీ తిరిగి ఖర్చు పెట్టుకుంటే తప్ప.. మనుగడ ఉండదని భావిస్తున్నారు. అంటే సర్కారు చేసిన హడావుడి, నమ్మించిన తీరుకు భారీగా జేబులు గుల్లా చేసుకొని నష్టపోయామన్న అవేదన, బాధ ప్రస్తుతం బీసీ వర్గాల అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు మేమున్నామంటూ.. చెప్పిన నాయకులు ఆర్థికంగా నష్టపోయిన తమకు అండగా నిలుస్తారా? అన్న వాదనలు, ప్రతిపాదనలు ప్రస్తుతం అధికార పార్టీలో సాగుతున్నాయి. ముఖ్యమంత్రి మాటలు, ప్రభుత్వం చేసిన హడావుడిని నమ్మి ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి వచ్చిందన్న అవేదన వ్యక్తమవుతోంది. ముమ్ముందు ఈ పరిస్థితులు ఎటువైపు దారి తీస్తాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# సంపాదకీయం

## గాజాలో శాంతివీచిక!

రెండేళ్ల నుంచి అవిచ్ఛిన్నంగా క్షిపణులు, బాంబుల వర్షంతో కంటిమీద కునుకు లేకుండా గడిపిన గాజా ఇకపై గుండెల నిండా ఊపిరి పీల్చుకోనుంది. హమాస్%-% ఇజ్రాయెల్ యుద్ధం ఆగిపోయిందనీ, ఇరు పక్షాలూ కాల్పుల విరమణకు అంగీకరించాయనీ, శాంతి ప్రణాళికలో ఇది తొలి దశ అనీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన గమనిస్తే పూర్తిస్థాయి శాంతి స్థాపనకు మరికొంత సమయం పట్టొచ్చని స్పష్టంగానే తెలుస్తోంది. ఇంత హడావిడిగా సంధి కుదిరినట్టు ప్రకటించటం వెనక శుక్రవారం ప్రకటించబోయే నోబెల్ శాంతి బహుమతికి అర్హత సాధించటం కోసమేనని అందరికీ తెలుసు. ట్రంప్ అందుకు అర్హుడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సిఫార్సు చేస్తున్నారు. తమ భూభాగంలోకి చొరబడి 2023 అక్టోబర్ 7న 1,100 మంది పౌరులను హతమార్చి, 251 మందిని అపహరించుకుపోయిన హమాస్ దుందుడుకు చర్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ 24 నెలల పాటు గాజాపై నిప్పుల వాన కురిపించింది. ఏ క్షిపణి ఎక్కడ పడుతుందో, ఏ బాంబు ఎవరి ప్రాణం తీస్తుందో తెలియక గాజా వాసులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. జనావాస ప్రాంతాలన్న ఇంగిత జ్ఞానం లేకుండా క్షిపణులు ప్రయోగించటం, ఆకాశాన్నంటే అపార్ట్‌మెంట్లు క్షణంలో కూలి శిథిలాల గుట్టగా మారటం ప్రపంచ ప్రజలంతా చూశారు. కనీసం ఇద్దరో ముగ్గురో మరణించని కుటుంబం లేదు. కొన్ని కుటుంబాలైతే పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. మధ్యలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాలు... ఇజ్రాయెల్ ఉల్లంఘనల వల్ల పెద్దగా ఉపశమనం ఇచ్చింది లేదు. దీన్ని యుద్ధం అనడం ఇజ్రాయెల్ సాగించిన నరమేధాన్ని కప్పిపుచ్చే యత్నమే అవుతుంది. బలాబలాల్లో ఎంత వ్యత్యాసం ఉన్నా రెండు దేశాల మధ్య పరస్పరం కొన సాగే ఘర్షణల్ని యుద్ధం అంటారు. ఇక్కడ జరిగిందంతా వేరు. ఇజ్రాయెల్ లోపాయకారీ మద్దతుతో ఎన్నికల ద్వారా అధికారం చేజిక్కించుకుని గాజా ప్రజలపై పెత్తనం సాగిస్తూ, పాలస్తీనా అథారిటీని బేఖాతరు చేస్తూ వచ్చిన హమాస్ ఉన్నట్టుండి ఉగ్రవాద దాడికి పూనుకొంది. ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల్లో అధికారిక లెక్కల ప్రకారమే 67,183 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 1,69,841 మంది గాయాల పాలయ్యారు. వైద్య సిబ్బంది, పాత్రికేయులన్న విచక్షణ లేకపోగా, చాలా సందర్భాల్లో వారిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యాలు హతమార్చటం ఆధునిక చరిత్రలో కనీవినీ ఎరుగనిది. దాడులు ఆగుతాయంటున్నారు గనుక శిథిలాల తొలగింపు మొదలవుతుంది. అప్పుడు గానీ మృతుల అసలు సంఖ్య ఎంతో తెలియకపోవచ్చు. ఇప్పటికీ ఆచూకీ తెలియనివారు వేలల్లో ఉన్నారు. ఇజ్రాయెల్ ఘాతుకాల వెనక జాత్యహంకారం స్పష్టంగా కనబడుతుండగా, ఆ దుండగాన్ని ధర్మబద్ధంగా వ్యతిరేకించినవారిని యూదులపై వివక్ష ప్రదర్శిస్తున్నవారిగా జమకట్టి వేధించటం, విశ్వవిద్యాలయాల్లోకి పోలీసులు చొరబడి అరెస్టులు చేయటం ట్రంప్ నైజానికి అద్దం పడుతుంది. గాజాలో హమాస్ ఒక్కటే లేదు. పాలస్తీనా విమోచన కోసం పోరాడే సంస్థలు డజను వరకూ ఉన్నాయి. ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వెనక్కి పోలేదు. గాజాలోనే ఒక హద్దు నిర్ణయించుకుని ఆగింది. ఇప్పుడు కుదిరిన ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఎంతవరకూ గౌరవిస్తుందో తెలియదనీ, ఒప్పందంలోని చాలా క్లాజులు అస్పష్టతతో ఉన్నా కేవలం ట్రంప్ హామీని నమ్మి సమ్మతించామనీ ఆ సంస్థల ప్రతి నిధులు చెబుతున్న తీరు గమనార్హం. ట్రంప్‌కు నోబెల్ వస్తే తప్ప ఈ ఒప్పందం సజావుగా ముందుకు పోదు. రెండో దశ చర్చల్లోనే అసలు అంశాలు ప్రస్తావనకొస్తాయి. అప్పుడు మరణమో, శరణమో పాలస్తీనా సంస్థలు తేల్చుకోక తప్పదు. ట్రంప్‌కు పురస్కారం లభిస్తే గాజా వాసులకు ఉన్నంతలో గౌరవప్రదమైన పరిష్కారం దొరకొచ్చు. రాకపోతే పరిణామాలు వేరుగా ఉండే అవకాశం ఉంది. అయితే నరమేధాన్ని కొనసాగించటం ఇక సాధ్యపడకపోవచ్చు. ఎందుకంటే హమాస్ చెరలోని బందీలంతా విడుదలయ్యారు. అటు ఇజ్రాయెల్ జైళ్లలోని పాలస్తీనా పౌరులు దాదాపు 2,000 మంది విడుదలవుతున్నారు. గాజా విషయంలో ఐక్యరాజ్య సమితిలో అమెరికా, ఇజ్రాయెల్ ఒంటరిగా మిగిలిపోయిన కొన్ని రోజులకే ఆ రెండు దేశాలూ తమకేం పట్టనట్టు ఈ శాంతి ఒప్పందం సాధించటం ఒక వైచిత్రి.

# దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం



మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వార్త ఇటీవల జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది. ఒక కానిస్టేబుల్ పోస్టుకు 42 మంది పీహెచ్‌డీ స్కాలర్లు సహా 13,000 మంది దరఖాస్తు చేసుకోవడమే ఆ వార్త సారాంశం. ఈ అంకెలు క్షణకాలం పాటు ఆశ్చర్యం కలిగించినా, ఆ తర్వాత అవి మన మనసుల్లో ముద్రపడిపోతాయి. ఆ అంకెల గురించి తెలుసుకోవాలన్న ఆత్రుత వల్ల కాదు. అది మనకు ఏం చెప్తుందన్న ఉత్సుకత అందుకు కారణం. మన దేశంలో అత్యంత విద్యావంతులైన పీహెచ్‌డీ స్కాలర్లు కూడా ప్రాథమిక స్థాయి కొలువుల కోసం లైన్లలో నిల్చుంటున్నారు. ఇది ఏం సూచిస్తున్నది? ఇది దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ లక్షణమా? లేదా విద్య, అవకాశాల మధ్య ఉన్న అసమతుల్యతా? లేదా ప్రభుత్వ ఉద్యోగాల పట్ల మనకున్న శాశ్వత మోజుకు నిదర్శనమా? లేదా భారత శ్రామిక మార్కెట్ గురించి చెప్పలేని ఆందోళనా? అయితే, ఇది ఒక్క మధ్యప్రదేశ్ రాష్ట్రానికే పరిమితం కాదు. రాజస్థాన్‌లో 10 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు 3.7 లక్షల మంది పోటీపడ్డారు. ఏపీలో వేల పోస్టులకు లక్షల మంది పరీక్షలు రాశారు. ఇది పోలీసు శాఖకు మాత్రమే పరిమితం కాలేదు. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఇటీవల 1,846 ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, దరఖాస్తులు వెల్లువలా వచ్చిపడ్డాయి. స్వీపర్ అయినా కావచ్చు, ఇంజినీర్ అయినా కావచ్చు.. ఆ పో స్టు అర్హతలకు మించినవారు చాలామంది ఎగబడుతున్నారు. ఉద్యోగ భద్రత ఉండే ప్రభుత్వ కొలువు కోసం లక్షల మంది పట్టభద్రులు పోటీపడుతున్నారు. ఇవి నియామకాల్లో కనిపించే గణాంకాలు మాత్రమే కావు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ తన జనాభా సామర్థ్యాన్ని అర్థవంతమైన ఉపాధిగా మార్చుకోలేకపో తున్నదని చెప్పేందుకు నిదర్శనం. మన దేశంలో ఏటా శ్రామిక జనాభా 90 లక్షల వరకు పెరుగుతున్నది. కానీ, ఆ మేరకు ఉద్యోగ సృష్టి మాత్రం జరగడం లేదు. ఆర్థిక వ్యవస్థ వృద్ధి సాధిస్తున్నది కానీ, అందుకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. కొంతవరకు ఉపాధి సృష్టి జరుగుతున్నా, అవన్నీ అసంఘటిత రంగంలోని ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలే. ఇలాంటి కొలువుల్లో తక్కువ వేతనాలు వస్తాయన్న విషయం ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కరోనా మహమ్మారి కాలం ఈ అభద్రతను మరింత పెంచింది. కరోనా తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ కోలుకున్నప్పటికీ, ఉపాధిరంగం మాత్రం ఇంకా తేరుకోలేదు. నైపుణ్యం ఉన్నవారు (చాలా తక్కువ మంది) టెక్, ఫైనాన్స్ తదితర రంగాల్లో స్థిరపడ్డారు. కానీ, గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లలో చాలామందికి ఉపాధి దొరకడం లేదు. లక్షల మంది తమ విద్యార్హతలతో సంబంధం లేని చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. ఇంకొంతమంది జీవనోపాధి దొరక్క శ్రామికవర్గానికి పూర్తిగా దూరమయ్యారు. ఒకప్పుడు ఉద్యోగ, ఉపాధికి నిచ్చెన లాంటి విద్య.. ఇప్పుడు జీవనోపాధికి గ్యారెంటీ ఇవ్వనిదిగా మారడం బాధాకరం. పీహెచ్‌డీ చేసిన వ్యక్తి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎందుకు దరఖాస్తు చేస్తున్నాడనే విషయాన్ని మనం అర్థం చేసుకోవాలంటే జీతాన్ని కాదు, ఆ కొలువుకు ఉన్న గుర్తింపును చూడాలి. ప్రైవేటురంగంలో అస్థిరత నేపథ్యంలో దేశంలోని చాలా కుటుంబాలు ఉద్యోగ భద్రత వైపు మొగ్గుచూపుతున్నాయి. గ్రామాలు, చిన్న చిన్న పట్టణాల్లో సర్కారీ నౌకరీ అంటే జీవనోపాధి మాత్రమే కాదు, సమాజంలో గౌరవానికి అదొక చిహ్నం. పెన్షన్ లాంటి సామాజిక రక్షణలు లేకపోవడంతో ప్రైవేటు రంగంపై యువతలో ఆసక్తి తగ్గిపోతున్నది. ఎవరూ వాటిపై మక్కువ చూపడం లేదు. ఈ నేపథ్యంలో పోలీసు లేదా మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగమంటే భవిష్యత్ అనిశ్చితిని రూపుమాపే భరోసాలాగా మారిపోయింది. మన దేశంలో విద్యావ్యవస్థల నుంచి బయటికొచ్చే ప్రొడక్ట్‌కు, ఉపాధి మార్కెట్ డిమాండ్‌కు మధ్య నిర్మాణాత్మక అసమతు ల్యత ఉంది. గత రెండు దశాబ్దాలుగా ఇంజినీరింగ్, మేనేజ్ మెంట్, సాధారణ డిగ్రీ లాంటి ఉన్నత విద్య కోర్సులు బాగా విస్తృతమయ్యాయి. అయితే, ఇవి మన దేశ ఉపాధిరంగంతో సరితూగడం లేదు. విద్యాసంస్థల్లో బోధించే పాఠ్యాంశాలకు, పరిశ్రమల అవసరాలకు మధ్య పొంతనే ఉండటం లేదు. ఫలితంగా మనం గ్రాడ్యుయేట్ స్థాయి ఉద్యోగాల కంటే వేగంగా గ్రాడ్యుయేట్లను సృష్టిస్తున్నాం. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఈ గ్రాడ్యుయేట్లకు ఉపాధి చూపలేకపోతున్న మార్కెట్.. వారిని తమ అర్హత కంటే తక్కువ స్థాయి ఉద్యోగా లు చేసేలా మెడలు వంచుతున్నది. ఈ అసమతుల్యత ఆర్థిక పరమైన అంశాలను మించి ప్రభావాన్ని చూపుతున్నది. నిరా శను పెంచుతున్నది. ప్రభుత్వాలపై నమ్మకాన్ని తగ్గించడమే కాకుండా, ద్వేషాన్ని పెంచుతున్నది. ఏఐ, ఆటోమేషన్ మన వ్యవస్థలోకి వేగంగా దూసుకొస్తున్న నేపథ్యంలో ఇప్పుడు కొత్త ఉద్యోగాల సృష్టి మాత్రమే కాదు, ఏది సురక్షితమైన ఉపాధి అనేది నిర్వచించడమూ సవాలుగా మారుతున్నది. ఈ నేపథ్యంలో విద్య, పరిశ్రమలకు మధ్య వారధిగా ఉండే స్థిరమైన కార్మిక-మార్కెట్ వ్యూహం భారత్‌కు అవసరం. అత్యంత విషాదకరమైన అంశమేమిటంటే.. అత్యధిక అర్హత, ఉపాధికి సంబంధించిన ఈ కథనం సమీప భవిష్యత్తులోనూ మారకపోవచ్చు. ఒక కానిస్టేబుల్ పోస్టుకు 13 వేల మంది దరఖాస్తు చేయడాన్ని నిరాశ, నిస్పృహగా మనం చూడకూడదు. ఇది జీవనోపాధి, గుర్తింపు కోసం చేస్తున్న పోరాటానికి ప్రతీక. ఈ ఆర్థిక వ్యవస్థలోకి దూరేందుకు పట్టభద్రులైన నిరుద్యోగులు ఇంకా సర్కారీ కొలువుల కోసం దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారనడానికి తార్కాణం.

# తాలిబన్‌లతో సఖ్యత!

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులుండరన్న నానుడి దౌత్యానికి కూడా వర్తిస్తుంది. పైకి ఏం చెబుతున్నా, ఇతరేతర ప్రత్యామ్నాయాల సాధ్యాసాధ్యాలను పరిశీలించటమనే ప్రక్రియ దౌత్యంలో నిరంతరం కొనసాగుతుంటుంది. పర్యవసానంగా ఒక్కోసారి అనూహ్య పరిణామాలు కూడా చోటుచేసుకోవచ్చు. తాలిబన్‌ల ఆధ్వర్యంలోని అఫ్గానిస్తాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకీ గురువారం అయిదు రోజుల భారత సందర్శనకు రావటం అటువంటిదే. ఇది దక్షిణ, మధ్య ఆసియా భౌగోళిక రాజకీయాలను ప్రభావితం చేసే పరిణామం. ప్రపంచ దేశాల్లో రష్యా మినహా మరే దేశమూ ఇంతవరకూ అఫ్గాన్ ప్రభుత్వాన్ని లాంఛనంగా గుర్తించలేదు. మన దేశం తొలిసారి ఆ దిశగా అడుగులేస్తున్నది. అమీర్ ఖాన్ రానున్న సంద ర్భంగా తాలిబన్‌ను ప్రాంతీయ బృందంలోని భాగస్వామిగా గుర్తించటానికి భారత్ సిద్ధపడింది. తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించటం ఇక లాంఛన ప్రాయం. భద్రతా మండలి ఉగ్రవా దులుగా గుర్తించి ఆంక్షలు విధించిన వారిలో అమీర్ ఖాన్ ఒకరు. దానికింద ఆయన తారసపడితే అరెస్టు చేయాల్సి ఉం టుంది. భారత్ చొరవతో ఈ విషయంలో తాత్కాలికంగా మిన హాయింపు లభించింది. తొలిసారి 1996లో అఫ్గాన్ తాలిబ న్‌ల వశమైనప్పుడు మనకు ఎన్ని విధాల సమస్య లొచ్చాయో ఎవరూ మరిచిపోరు. సోవియెట్ దురాక్రమణను ప్రతిఘటించి పాలనాధి కారాన్ని స్వాధీనం చేసుకున్న తాలిబన్‌లు అనేకమంది మిలిటెంట్లను కశ్మీర్‌కు తరలించారు. పర్యవసా నంగా అక్కడ నెత్తురుటేర్లు పారాయి. కేంద్రంలో వాజ్‌పేయి నాయ కత్వాన తొలి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక 1999లో ఉగ్రవాదులు ఖాట్మండు నుంచి న్యూఢిల్లీ వచ్చే విమానాన్ని హైజాక్ చేసి అఫ్గాన్‌లోని కాందహార్‌కు తరలించారు. ముగ్గురు ఉగ్రవాదుల్ని విడిపించుకున్నారు. ఈ చర్య వెనక నేరుగా తాలిబన్‌లు లేక పోయినా ఉగ్రవాదులు సురక్షితంగా వెళ్లటానికి సహకరించారు. తాలిబన్‌లతో చర్చలు గానీ, గుర్తింపుగానీ ఉండబోదని అప్పట్లో మన దేశం ప్రకటిం చింది. ఇంటా, బయటా వారు సాగిస్తున్న అరాచకాలను తీ వ్రంగా ఖండించేది. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో అమెరికా 2001లో అఫ్గాన్‌ను దురాక్రమించాక ఏర్పడిన ప్రభుత్వాలకు మన దేశం మద్దతుగా నిలిచింది. 2021లో తాలిబన్‌ల పునరాగమనంతో అష్రాఫ్ ఘనీ ప్రభుత్వం పడిపోయేవరకూ మన దేశం పలు అభివృద్ధి ప్రాజెక్టులు చేప ట్టింది. రూ. 25,000 కోట్ల వ్యయంతో పార్లమెంటు భవనా న్నీ, సల్మా ఆనకట్టనూ, ఒక జాతీయ రహదారినీ నిర్మించింది. విద్యుదు త్పాదన ప్రాజెక్టులు, విద్య, వైద్యం తదితరాల్లో పాలుపంచు కుంది. ఇవన్నీ తాలిబన్‌లలో సద్భావన కలిగించటంతో పాటు పాకిస్తాన్‌తో వచ్చిన విభేదాలు కూడా వారిని భారత్‌వైపు మొగ్గేలా చేశాయి. పాక్- అఫ్గాన్ దీర్ఘకాల సంబంధాలూ, ఉజ్బెకిస్తాన్ ద్వారా సన్నిహితం కావటానికి పాక్ చేస్తున్న ప్రయత్నాలూ, చైనా వరస మంతనాలూ మన దేశంలో కూడా పునరాలోచన కలిగించాయి. మనం ముందడుగు వేయన ట్టయితే ఏదోనాటికి తాలిబన్%-%పాకిస్తాన్ సంబంధాలు మెరుగుపడి, చైనా పలుకుబడి పెరిగి అది మన భద్రతకు ముప్పు కలిగించే అవకాశం కూడా ఉంటుంది. పైగా అమె రికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యూహాత్మకంగా కీలకమైన అఫ్గాన్‌లోని బగ్రాం వైమానిక స్థావరాన్ని తమకు అప్పగిం చాలని కోరుతున్నారు. ఇది కూడా మన భద్రతను ప్రశ్నార్థకం చేసే పరిణామం. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకోబట్టే తాలిబన్‌లతో సత్సంబంధాలకు మన దేశం సిద్ధపడింది. ఏ దేశానికైనా స్వీయ ప్రయోజ నాలు, భద్రత అత్యంత కీలకం. ఆ తర్వాతే మిగిలిన వన్నీ. గత నాలుగేళ్లుగా మన దేశం వేలాది టన్నుల గోధుమలు, వందల టన్నుల మందులు, వ్యాక్సిన్లు, భారీ మొత్తంలో పురుగుమందులు, అత్యవసర సరు కులు పంపింది. ఇటీవల భూకంపం వచ్చినప్పుడు టెంట్లు, మందులు, దుప్పట్లు, జనరే టర్లు అందించింది. కాబూల్‌లో పూర్తిస్థాయి దౌత్య కార్యాల యం కాకపోయినా సాంకేతిక కార్యాలయాన్ని తెరిచింది. తాలిబన్ ప్రభుత్వం ఢిల్లీలో రాయబార కార్యాలయం ప్రారంభించుకోవటానికి అనుమతి నిచ్చింది. ఈ అనుకూల వాతావరణంలో అఫ్గాన్‌తో సత్సంబం ధాలకు ప్రయత్నించటం అనేక విధాల శుభ పరిణామం.

## సమాచార హక్కు చట్టం- పారదర్శకత

భారత ప్రజాస్వామ్య చరిత్రలో పారదర్శకత, జవాబుదారీ తనాన్ని బలపరుస్తూ ప్రజలకు పాలనపై ప్రశ్నించే అధికారం కల్పించిన చట్టం సమాచార హక్కు చట్టం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్న మౌలిక సూత్రానికి న్యాయం చేస్తూ, ఈ చట్టం దేశ ప్రజలకు ఒక విప్లవాత్మక సాధనంగా మారింది. భారత పార్లమెంటు ఆమోదంతో రూపొందిన ఈ చట్టం 2005 జూన్ 15న రాష్ట్రపతి ఆమోదం పొందగా, 120వ రోజు అయిన అక్టోబర్ 12, 2005న దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. ఆ రోజు భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓ నూతన అధ్యాయంగా నిలిచి పోయింది. సమాచార హక్కు చట్టం పుట్టుక వెనుక ప్రజా ఉద్యమాల సుదీర్ఘ పోరాటం ఉంది. రాజస్థాన్ రాష్ట్రంలో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ వంటి సామాజిక సంస్థలు ప్రభుత్వ ఖాతాల పారదర్శకత కోసం చేసిన పోరాటం ఈ చట్టానికి పునాది వేసింది. “ప్రభుత్వం ప్రజల సొమ్ముతో నడుస్తుంది, కాబట్టి ప్రజలకు లెక్క చెప్పాల్సిందే” అనే నినాదంతో ప్రారంభమైన ఆ ఉద్యమం దేశవ్యాప్త చైతన్యానికి దారితీసింది. చివరికి యూపీఏ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమాచార హక్కు బిల్లును రూపొందించి పార్లమెంటులో ఆమోదింప జేసింది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం... ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను, బాధ్యతను పెంచడం. ప్రభుత్వ నిర్ణయాలు, ఫైళ్లు, కాంట్రాక్టులు, టెండర్లు, ఖర్చులు వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా అవినీతి తగ్గించడం, ప్రజా నిధుల వినియోగాన్ని సక్రమంగా పర్యవేక్షించడానికి ప్రజలకు అవకాశం కల్పించడం దీని లక్ష్యం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కింద పౌరులకు ఇచ్చిన మాటల స్వేచ్ఛలో భాగంగానే సుప్రీంకోర్టు సమాచార హక్కును మౌలిక హక్కుగా పరిగణించింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి పౌరుడికి ప్రభుత్వం నుండి సమాచారాన్ని అడిగే చట్టబద్ధ హక్కు ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అన్ని సంస్థలు ప్రజలకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత వహించాలి. దరఖాస్తు లిఖిత పూర్వకంగా లేదా ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చు. సాధారణంగా సమాచారం ఇవ్వడానికి 30 రోజులు గడువు ఉంటే, జీవితం లేదా స్వేచ్ఛకు సంబంధించిన అంశాల్లో 48 గంటల్లోపే సమాధానం ఇవ్వాలి. సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగితే లేదా నిరాకరించినట్లయితే సంబంధిత అధికారిపై రోజుకు రూ. 250 చొప్పున జరిమానా విధించే అవకాశం చట్టంలో ఉంది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రజలు దీన్ని శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, రోడ్లు, భూముల రికార్డులు, విద్యా నియామకాలు, స్థానిక సంస్థల ఖర్చులు వంటి అనేక అంశాల్లో పౌరులు సమాచారాన్ని కోరారు. అనేక అవినీతి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మహారాష్ట్రలో భూసంబంధిత అవినీతి కేసులు, ఢిల్లీలో పాఠశాల భవనాల నిర్మాణంలో జరిగిన మోసాలు, బడ్జెట్ వినియోగాల్లో గోప్యతల ఉల్లంఘనలు ఈ చట్టం ద్వారానే బహిర్గతమయ్యాయి. ప్రజల చేతుల్లో ఈ చట్టం నిజమైన ప్రజాస్వామ్య పరికరంగా మారింది. చట్టం అమలుకు సంబంధించి కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్ర సమాచార కమిషన్లు ఏర్పాటు చేయబడ్డాయి. సమాచారం ఇవ్వని అధికారులను ప్రశ్నించడం, ప్రజల పిటిషన్లను విచారించడం వీటి బాధ్యత. తొలి కేంద్ర సమాచార కమిషనర్ వాజహత్ హబీబుల్లా కాగా, అనేక రాష్ట్రాల్లోనూ ఇలాంటి కమిషన్లు ఏర్పాటయ్యాయి. ఈ కమిషన్లు పౌరుల హక్కులను కాపాడడంలో, ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతను తీసుకు రావడంలో విశేష పాత్ర పోషించాయి. 2019లో చట్టంలో జరిగిన సవరణలతో కమిషనర్ల పదవీకాలం, వేతనాల నిర్ణయాధికారం కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వబడింది. ఈ మార్పులు పారదర్శకతను బలహీన పరిచే అవకాశం ఉందన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఇంకా ప్రభావవంతమైన సాధనంగానే ఉంది. అయితే దాని వినియోగం తగ్గిపోవడం, సమాచారం ఇవ్వడంలో ఆలస్యం, కొన్నిసార్లు సమాచారం కోరిన వ్యక్తులపై దాడులు జరగడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. సమాచార హక్కు చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు. ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజల కంటిచూపును నిలబెట్టే వ్యవస్థ ఇది. ప్రజాస్వామ్యం సజీవంగా ఉండాలంటే ప్రతి పౌరుడు ఈ చట్టాన్ని తెలుసుకొని వినియోగించాలి. అక్టోబర్ 12, 2005న భారత ప్రజాస్వామ్యం మరింత బలపడిందిబీ ప్రజల చేతిలో ఒక పెన్నుతో సత్యాన్ని వెలికితీసే శక్తి అప్పగించబడిన రోజు అది.

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ పద్మశాలి సంఘం నిరసన



**మంచిర్యాల,అక్టోబర్12(సూర్యరేఖ)**బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ మంచిర్యాల జిల్లా శ్రీభక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ... స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా కూడా మెజార్టీ సంఖ్యాకులైన బీసీలకు దక్కాల్సిన హక్కులు రాజ్యాధికారంలో వాటా రాకుండా పోవడం వల్ల బీసీలు వెనుకబాటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ రాష్ట్రంలో అనేక రకాలైన బీసీ ఉద్యమాల ఫలితంగా కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీ ప్రజలందరికీ హామీ ఇచ్చిన మేరకు ఈ రాష్ట్రంలోని బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో 9ను తీసుకురావడం జరిగిందన్నారు. ఆ మేరకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పిస్తూ ముందుకు పోతున్న తరుణంలో అగ్రవర్ణాలైనా రెడ్డి జాగృతి పేరుతో బీసీలకు రిజర్వేషన్ల కల్పిస్తు ఇచ్చిన జీవోకు వ్యతిరేకంగా హైకోర్టుకు వెళ్లడం జరిగిందని తెలిపారు.ఇటీవల హైకోర్టులో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లు ఆపుతూ స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఆపడం జరిగిందని,ఈ తీర్పు పట్ల మెజార్టీ బీసీ ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు ఉన్నదని ఈ రాష్ట్రంలో బీసీ వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ భాజపా పార్టీలు ఒక్క తాను ముక్కలేనని నిరూపించుకున్నారని ఆరోపించారు.దేశవ్యాప్తంగా 10శాతం కూడా లేని అగ్రవర్ణాలకు ఈడబ్ల్యుసి రిజర్వేషన్ల పేరుతో అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 55 నుండి 60 శాతంగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కూడా వ్యతిరేకించడం బాధాకరమైన విషయం అన్నారు. ఇకనైనా బీసీలకు దక్కాల్సిన 42 శాతం రిజర్వేషన్ల కోసం తమిళనాడు రాష్ట్రంలో మాదిరిగానే రాజ్యాంగంలోని ఆర్టికల్ 9వ షెడ్యూల్ లో పొందుపరిచి పార్లమెంట్ లో బిల్ ఆమోదం పొందే విధంగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కృషి చేసి 42 శాతం బీసీ రిజర్వేషన్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒత్తిడి తేవాలని ఈ సందర్భంగా కోరారు.బీసీ రిజర్వేషన్ల పట్ల స్థానుకూలంగా లేని రాజకీయ పార్టీలను రాబోయే అన్ని ఎన్నికలలో మా ఓట్లు మేమే వేసుకొని అగ్రవర్ణాల రాజకీయ పార్టీలకు బుద్ధి చెబుతామని పేర్కొన్నారు.తెలంగాణ జాతిపిత స్వాతంత్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో బీసీలకు దక్కల్సిన 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాలతో పాటు పద్మశాలీలు కూడా పోరాటలు చేయాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీభక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక అధ్యక్షుడు బీసీ సంఘాల నాయకులు గజెల్లి వెంకటయ్య సంఘం నాయకులు చెలిమెల అంజయ్య అంకం సతీష్,జే.శ్రీనివాస్ చంద్రగిరి చంద్రమౌళి కే.బిక్షపతి రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

# తల్లి ఇంటి ఎదుట నిరసన..తిండి పెట్టని కొడుకుపై వృద్ధురాలి ఆవేదన





**బెల్లంపల్లి,అక్టోబర్12(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణం హనుమాన్ బస్తీలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది.వృద్ధాప్యంలో తనకు ఆసరాగా ఉంటాడని నమ్మిన కొడుకు తిండి పెట్టకపోగా,ఇంట్లో ఉండనివ్వడం లేదని ఓ తల్లి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది.వివరాల్లోకి వెళ్తే... హనుమాన్ బస్తీకి చెందిన పొట్ట బాల మల్లమ్మకు నలుగురు కుమారులు,ఒక కూతురు ఉన్నారు. ఆమె భర్త సింగరేణిలో ఉద్యోగం చేయగా అనంతరం ఆ ఉద్యోగం తమ కుమారుడు పొట్ట రమేష్ కు లభించింది.

అయితే కాలక్రమేణా ముగ్గురు కుమారులు మరణించగా తనను చూసుకోవాల్సిన రమేష్, అతని భార్య తిండి పెట్టకుండా, పట్టించుకోకుండా చివరికి ఇంటి నుండి వెళ్లగొట్టారని మల్లమ్మ వాపోయింది.తన కూతురి వద్ద కొంతకాలం నివసించిన ఆమె,ఈ విషయమై బస్తీ పెద్దమనుషులను సంప్రదించగా వారు ఆదివారం మాట్లాడుకుందామని పిలిపించి చివరికి రాకుండా మొఖం చాటేశారని తెలిపారు. తన భర్త,కుమారుల ఆస్తి మొత్తం రమేష్ గుప్పిట్లోనే ఉందని మరొక కుమారుడు తిరుపతి అతని భార్య మరణించగా వారి పిల్లలు అనాధలుగా మారారని, వారు తమ వాటాను అడగగా వారిని కూడా బెదిరింపులకు గురి చేశారని మల్లమ్మ ఆరోపించారు. తనకు న్యాయం జరిగే వరకు ఇంటి ముందు నిరసన కొనసాగిస్తానని వృద్ధురాలు స్పష్టం చేసింది. స్థానికులు ఈ ఘటనపై చర్చించుకుంటూ పెద్దమనుషులు అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

# పోలియో చుక్కలు వేయిద్దాం పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దాం

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**




**ఉప్పల్,అక్టోబర్12(సూర్యరేఖ)** పోలియో చుక్కలు వేయిద్దాం,పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దాం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,స్థానిక చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్ ముదిరాజ్, హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ జరిపోతుల ప్రభుదాస్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...0-5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయిద్దాం అని పోలియోరహిత సమాజాన్ని నిర్మిద్దాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సౌసిల్యరాణి, మానసి రుత్విక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యాంసుందర్ సూపర్వైజర్లు పండరయ్య యాదమ్మ, ప్రమీల శశిధర్ రెడ్డి,ఫార్మసిస్ట్ నగేష్,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మైనారిటీ నాయకులు బద్రుద్దీన్ సీనియర్ నాయకులు ఏదుళ్ల కొండల్ రెడ్డి,మాస శేఖర్ పిల్లి నాగరాజ్ నిరంజన్‌రామ్ రెడ్డి,సుక్క కిరణ్,పిహెచ్ సి అధికారులు ఆశా వర్కర్లు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మధుకర్ ఆత్మహత్యపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందన..



**బెల్లంపల్లి,అక్టోబర్12 (సూర్యరేఖ)** బెల్లంపల్లి వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు మధుకర్ ఆత్మహత్య ఘటనపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట స్వామి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించి, దీనికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఈ ఘటన వల్ల వేమనపల్లి ప్రాంత ప్రజలు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మధుకర్ ఆత్మహత్యకు కారణమైన వారెవరైనా సరే,వారిపై తప్పనిసరిగా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..ఎవరైనా రాజకీయ ప్రయోజనాల కోసం ఈ ఘటనను వాడుకోవద్దు. నాపై బురద చల్లే ప్రయత్నాలు ప్రతిపక్షాలు మానుకోవాలి.నాకు ఏ పార్టీ అయినా ప్రజలందరూ నాకు సమానమే.బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా సహాయం చేస్తాను, వారికి న్యాయం జరిగేలా చూసుకుంటాను అని తెలిపారు. మధుకర్ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి,ఇలాంటి విషాదకర సంఘటనలు మరలా జరగకూడదు.. పోలీసులు నిర్దిష్టంగా వేగంగా విచారణ జరపాలి అని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.

## పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

**పుట్టిన ప్రతి బిడ్డకూ పోలియో చుక్కలు వేయించండి..**

**కాటేదాన్ లో పిల్లలకు పోలియో చుక్కలు వేసిన జిల్లా వైద్య ఆరోగ్య అధికారి లలితాదేవి**



**రాజేంద్రనగర్,అక్టోబర్12(సూర్యరేఖ)** పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి లలితాదేవి అన్నారు.ఆదివారం కాటేదాన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా లలితాదేవి మాట్లాడుతూ...తల్లిదండ్రులందరూ తమ ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.మూడు రోజులపాటు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు.చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. పిల్లలకు అంగవైకల్యం సంభవించకుండా ప్రభుత్వం ప్రతి ఏటా రెండు విడతలు పోలియో చుక్కలు వేస్తుందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కలు వేయించాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రుల పైన ఉందన్నారు. అలాగే కాటేదాన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు.ఆరోగ్య కేంద్రంలోని సమస్యలతో పాటు రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఉద్యోగులు సమయపాలన పాటించకపోయినా,విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గ్యార్మీ వేడుకల్లో పాల్గొన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి





**ఉప్పల్,అక్టోబర్12 (సూర్యరేఖ)** హబ్సిగూడ డివిజన్ లో హబ్సిగూడ వీధి నంబర్-8 జి.జి కాలనీలో ఎండీ.జలీల్,సయ్యద్ అజ్జుల అధ్వర్యంలో గ్యార్మీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్యార్మీ నిర్వహణ కమిటీ సభ్యులు శ్రవణ్ కుమార్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్,డివిజన్ ప్రధాన-కార్యదర్శి దేవాదాయ ధర్మాదాయశాఖ డైరెక్టర్ ధర్మేంద్ర నాయక్ (ధర్మా),డివిజన్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుండురాజన్న డివిజన్ సెక్రటరీ షేక్ షబీర్,సుమన్ నాయక్,జగు,తదితరులు పాల్గొన్నారు.

# నూరేళ్ల జీవితానికి రెండు పోలియో చుక్కలు





**అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,లు**

**రాజేంద్రనగర్,అక్టోబర్12(సూర్యరేఖ)**నిండు నూరేళ్ల జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరి అని,ఆరోగ్యవంతమైన భావిభారత పౌరులను సమాజానికి అందించేందుకు ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్,చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,లు సూచించారు.పల్స్ పోలియోను పురస్కరించుకొని ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్,చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,జిల్లా కార్యదర్శి కొమురయ్యతో కలిసి ఆమె చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరని వారు తెలిపారు.దేశంలో అంగవైకల్యం తగ్గిందని.. పోలియో రహిత దేశంగా అడుగులు ముందుకు వేశామని పేర్కొన్నారు.మరణం తప్పినా అంగవైకల్యం తప్పని పోలియో మహమ్మారి నుంచి చిన్నారులను రక్షించేందుకు పోలియో చుక్కలు తప్పనిసరి అన్నారు.ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్ స్పష్టం చేశారు. పల్స్ పోలియో కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. పోలియో రహిత సమాజం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ జయానందరెడ్డి వైద్య సిబ్బంది అంగన్వాడీ టీచర్లు,తదితరులు పాల్గొన్నారు.

# పోలియో కేంద్రాలు పరిశీలిస్తూ,చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన రజిత పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,అక్టోబర్12(సూర్యరేఖ)**ఉప్పల్ డివిజన్ శాంతినగర్ కమ్యూనిటీహాల్ లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను సందర్శించి కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 5 సంవత్సరాలలోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండ రెండు పోలియో చుక్కలు వేయించాలని కోరారు.తద్వారా పోలియోను అంతమొదించి పోలియో రహిత దేశాన్ని నిర్మిద్దామని ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి రామ కృష్ణ,సల్ల ప్రభాకర్ రెడ్డి,జనరల్ సెక్రటరీ తుమ్మల దేవిరెడ్డి,అల్వాల భాస్కర్,కట్టపల్లి విజయ్ కుమార్ గుప్తా,జనగాం రామకృష్ణ అలుగుల అనిల్ కుమార్ కుషాంగాల్లా సతీష్ సతీష్ మహిళ నాయకులు రూతమ్మ,మహిళ అధ్యక్షులు రేణుక కవిత తదితరులు పాల్గొన్నారు.

## దోమకాటు నివారణకు పుల్లటి మజ్జిగ ద్రావణం ఎంతో మేలు

**రైతు రత్నగారి మహేందర్ రెడ్డి**




**నిజాంపేట,అక్టోబర్ 12(సూర్యరేఖ)** మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన రైతు రత్నగారి మహేందర్ రెడ్డి, పుల్లటి మజ్జిగ దోమకాటు నివారణ చేసుకోవచ్చని అతని వ్యవసాయ క్షేత్రం లో పుల్లటి మజ్జిగ ద్రావ ణం తయారు చేయు విధానం గూర్చి రైతులకు వివరించారు.దీనికి కావల సిన పదార్థాలు స్వచ్ఛమైన ఆవు పెరుగు ఆరులీటర్లు బియ్యం కడిగిన నీళ్లు ఆరు లీటర్లు ఆవు మూ త్రం ఒక లీటర్ అరకేజీ బెల్లం 50 గ్రాముల ఇంగువ వీటన్నిటిని 200 లీటర్ల డ్రమ్ములో బాగా కలపాలి కలిపిన ద్రావణం వరికి స్ప్రే చేసినట్లయితే పంట విత్తనానికి తాళ్లు రాకుండా పొట్ట దశలో ఉన్నప్పుడు పాలు నిండా తాగే అవకాశం ఎక్కువ ఉంటుందని,దోమ కాటు నివారణకు ఎంతో మేలు చేస్తుందని,మంచి దిగుబడి సాధించుకోవచ్చు అన్నారు.

## చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసిన గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్



**ఉప్పల్,అక్టోబర్12(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ లోని పలు కాలనీలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాలను గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ సందర్శించి పల్స్ పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి చిన్నారి ఆరోగ్యం సమాజ భవిష్యత్తు..0 నుండి 5 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి బాలబాలికకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించడం ప్రతి తల్లిదండ్రుల ప్రాథమిక బాధ్యత అని తెలిపారు.పోలియో అనే మహమ్మారిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా పాలుపంచుకోవాలని,ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్సవకుండా చూసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి వైద్య సిబ్బంది,ఆశా వర్కర్లు,వాలంటీర్లు,స్థానిక కమిటీ సభ్యులు సమన్వయంతో కృషి చేస్తున్నారని అభినందనలు తెలిపారు.

## డా.ఎన్.గౌతమ్ రావును ఘనంగా సన్మానించిన దేవర వంశీ..



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్12(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తున్న డా.ఎన్. గౌతమ్ రావును బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా బిజెపి యువనాయకుడు,సెంట్రల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీ కలిశారు.ఈ సందర్భంగా డా.ఎన్. గౌతమ్ రావును శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.అనంతరం దేవర వంశీ మాట్లాడుతూ... బూత్స్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి డా.ఎన్.గౌతమ్ రావుతో కలసి పనిచేస్తాం అన్నారు.

## బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ అసలు రంగు బయట పడింది..

**శేఖర్ రెడ్డి.**



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్12 (సూర్యరేఖ)**కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట బీసీ సామాజిక వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా బీసీలకు నిజమైన న్యాయం చేయడంలో విఫలమైందని ఈ రోజు హైకోర్టు తీర్పుతో పార్టీ అసలు ఉద్దేశం బట్టబయలైంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నాయకులు భారత రాష్ట్ర సమితి కార్వాన్ నియోజకవర్గం హడహక్ కమిటీ సభ్యులు పార్టీ సీనియర్ నాయకులు కడెంగారి శేఖర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ...బీసీ రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి మళ్లీ బహిర్గత మైందన్నారు.బీసీ రిజర్వేషన్ బిల్లుపై సరైన చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయకుండా రెండేళ్లుగా బీసీలను మోసం చేస్తూ నాటకాలు ఆడిందన్నారు.బీసీల హక్కులు,రిజర్వేషన్ల పరిరక్షణ కోసం భారత రాష్ట్ర సమితి పార్టీ ఎల్లప్పుడూ అగ్రగామిగా నిలుస్తుందని,ఈ అంశంలో బీసీ వర్గాల న్యాయమైన హక్కులను కాపాడేందుకు తమ పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని కడెంగారి శేఖర్ రెడ్డి స్పష్టం చేశారు.

## పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలి..

**పోలియో చుక్కలతో చిన్నారులకు భవిత..**

**పిల్లలకు పోలియో చుక్కలు వేసిన**

**భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్**



**రాజేంద్రనగర్,అక్టోబర్12(సూర్యరేఖ)**ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పకుండా పోలియో చుకలు వేయించాలని తల్లిదండ్రులకు భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ సూచించారు.పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఆదివారం రాజేంద్రనగర్ లోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.పోలియో వ్యాధిని రూపుమాపేందుకు అందరూ సహకరించాలని పేర్కొన్నారు.అనంతరం వై.శ్రీధర్ మాట్లాడుతూ... చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి,పిల్లలు పోలియో బారిన పడితే ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం..అందుకే అందరూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాల'ని కోరారు.చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని చెప్పారు.మూడు రోజులపాటు వైద్య సిబ్బంది పోలియో చుకలు వేస్తారని చెప్పారు.నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేసి చిన్నారుల భవిష్యత్తుకు బంగారుబాటలు వేద్దామని పేర్కొన్నారు.ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని,అది మనందరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆశ వర్కర్ తిగపురం మినా, అంగన్వాడీ టీచర్ సంగీత,డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్,తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతాం

**కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకే బాకీ కార్డుల పంపిణీ..**
**బీఆర్ఎస్ జిల్లా,మండల స్థాయి బలోపేతానికి కృషి చేస్తాం..**
**2028లో ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో ఉంటా..**
**మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంటారెడ్డి తిరుపతిరెడ్డి**





**నిజాంపేట,అక్టోబర్12(సూర్యరేఖ)** అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి హామీలను తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కంటారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు.ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలోని నువ్వు వంజరి సంఘంలో ఆదివారం మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని,కాంగ్రెస్ చేసిన మోసపూరిత హామీలను ఎండగడుతూ బాకీ కార్డులను ప్రతి ఇంటి ఇంటికి పంచేలా చూడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి హామీలను బాకీ కార్డుల ద్వారా గ్రామంలో ప్రతి ఇంటింటికి పంపిణీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు సైనికుల పనిచేసేలా దిశా నిర్దేశం చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి మహిళ భర్తల వద్ద డబుల్ చార్జీలు తీసుకుంటున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని. రానున్న జెడ్పిటిసి,ఎంపిటిసి,స్థానిక సర్పంచ్ ఎన్నికలలో మెదక్ నియోజకవర్గంలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు.అలాగే నియోజక వర్గంలోని అన్ని స్థానాలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిచే విధంగా శ్రమిస్తామని తెలిపారు 2028లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటూ కెటీఆర్,హరీష్ రావు ఆశీస్సులతో 2029,లో ఎమ్మెల్యేగా గెలుపొంది నియోజకవరాన్ని మరింత అభివృద్ధి పతంలోకి తీసుకెళ్తామన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చల్మేటి నాగరాజు,సొసైటీ చైర్మన్లు అందే కొండల్ రెడ్డి,బాపురెడ్డి,మాజీ సర్పంచులు సంగుస్వామి గోపరి నర్సింలు రెడ్డిశెట్టి రవీందర్,అరుణ్ కుమార్ యూత్ అధ్యక్షులు మావూరంరాజు మాజీ ఎంపిటిసిలు చింతల స్వామి బాల్ రెడ్డి వెంకట స్వామి సుదర్శనం లచ్చపేట రాములుగౌడ్ బాల్ రెడ్డి నరేందర్ నాయక్,శ్రీనివాస్ గౌడ్ హనుమంత్ రెడ్డి,దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలల్లో సతీష్ బాడ్ల పూజలు..



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్12(సూర్యరేఖ)**రామాయణ కావ్యాల సృష్టికర్త ఆది కవి భగవాన్ మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను సీతారాం బాగ్ కిస్తీ చమన్,జిన్సీ కూడలి చుడీ బజార్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చ మాజీ అధికార ప్రతినిధి సతీష్ బాడ్ల పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సతీష్ బాడ్ల మాట్లాడుతూ...ఈ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.సతీష్ బాడ్లను నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

## రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి దశదిన కర్మలో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్,అక్టోబర్12(సూర్యరేఖ)**మాజీ మంత్రివర్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.ఈ సందర్భంగా రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి పవిత్రఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

## మండల కేంద్రంలో వృధాగా పోతున్న మిషన్ భగీరథ నీరు..




**నిజాంపేట,అక్టోబర్12(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని రైస్ మిల్ సమపంలో మటన్ షాప్ నిర్వాహకులు మిషన్ భగీరథ నీళ్లను వృధాగా వదిలేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి నీరు అందించాలనే కృత నిత్యంతో ఉంటే కొందరు నిర్లక్ష్యంగా నల్ల నీరును వృధా చేస్తున్నారు.నీటిని వృధా చేయటంతో వేరే వారికి నీళ్లు రావడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి నల్లాలకు డమ్మీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## హబ్సిగూడలో పల్స్ పోలియో కేంద్రాలలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసిన కంది శ్రవణ్ కుమార్ రెడ్డి



**ఉప్పల్,అక్టోబర్12(సూర్యరేఖ)**హబ్సిగూడ గాంధీ గిరిజన బస్తీ కమిటీ హాల్ లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్,డివిజన్ ప్రధాన-కార్యదర్శి దేవాదాయ ధర్మాదాయశాఖ డైరెక్టర్ ధర్మేంద్ర నాయక్(ధర్మా), సీనియర్ నాయకులు రాజు నాయక్,హబ్సిగూడ డివిజన్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుండురాజన్న,డివిజన్ కార్యదర్శి సుమన్ నాయక్,లింగా నాయక్,ఆశావర్కర్లు లక్ష్మి,ఆర్.పి. సరిత,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే కాలనీలు అభివృద్ధి

**అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి..**
**బండ్లగూడ కార్పొరేషన్ బిజెపి సీనియర్ నాయకుడు నిరుడు శేఖర్ ముదిరాజ్**



**రాజేంద్రనగర్,అక్టోబర్12(సూర్యరేఖ)**కాలనీ అభివృద్ధి కోసం కాలనీ ప్రజలంతా ఏకతాటిపైకి ముందుకు వచ్చి అభివృద్ధి పరచుకోవడం అభినందనీయమని కిస్మత్పూర్ మాజీ ఉపసర్పంచ్ బండ్లగూడ కార్పొరేషన్ బిజెపి సీనియర్ నాయకుడు నిరుడు శేఖర్ ముదిరాజ్ వెల్లడించారు. ఆదివారం కిస్మత్పూర్ శ్రీకృష్ణ కాలనీ అసోసియేషన్ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్ ను కలిసి కమిటీ హాల్ నిర్మాణం కోసం సహకరించాలని కోరారు.అందుకు ఆయన స్పందించి కమిటీ హాల్ నిర్మాణం కోసం లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు.అనంతరం మాట్లాడుతూ..అభివృద్ధి పనుల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని నిరుడు శేఖర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.భద్రత కోసం కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీలో పచ్చదనాన్ని పెంపొందించాలని,అలాగే భూగర్భ జలాలను ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి పెంచుకోవాలన్నారు.ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు నేరడు శేఖర్ ముదిరాజ్,కు కృతజ్ఞతలు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ గౌడ్,ప్రధాన కార్యదర్శి బాబురావు, ఉపాధ్యక్షులు లింగరాజు,గోవింద్,కృష్ణరావు, కోశాధికారి రామకృష్ణ సభ్యులు వెంకటేశ్వర్లు రమేష్ గౌడ్ జి.రమేష్, దాల్ నాయుడు చంద్రశేఖర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ అభివృద్ధికే మొదటి ప్రాధాన్యత

**ఎంఐఎం కార్వాన్ డివిజన్ కార్పొరేటర్ స్వామి యాదవ్**



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్12(సూర్యరేఖ)** కార్వాన్ డివిజన్ అభివృద్ధికే ప్రాధాన్యత అని స్థానిక కాలనీ,బస్తీలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఏఐఎంఐఎం కార్వాన్ డివిజన్ 65 కార్పొరేటర్ స్వామి యాదవ్ అన్నారు.ఈ సందర్భంగా “సూర్యరేఖ” ప్రతినిధితో కార్వాన్ డివిజన్ కార్పొరేటర్ స్వామి యాదవ్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు చేపట్టాల్సిన అభివృద్ధి పనుల విషయమై ఆదివారం డివిజన్ ప్రజలు తనను కలవడం జరిగిందని,త్వరలోనే బస్తీలు,కాలనీలో పర్యటించి,అక్కడి సమస్యలు తెలుసుకొని సత్వరమే పరిష్కరిస్తామన్నారు. అలాగే అభివృద్ధి పనులను కూడ దశలవారిగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ముఖ్యంగా కార్వాన్ డివిజన్ అభివృద్ధికోసం డివిజన్ లోని సమస్యల పరిష్కారం అభివృద్ధిపనులు చేపట్టడం జరుగుతుందన్నారు. డివిజన్ లో అత్యవసరం ఉన్నచోట ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని కార్పొరేటర్ స్వామియాదవ్ తెలియచేశారు. డివిజన్ ప్రజలు ఏ చిన్న సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని బస్తీలు,కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్య ఇవ్వడం నా ప్రథమ లక్ష్యం అని ఈ సందర్భంగా కార్పొరేటర్ స్వామియాదవ్ పేర్కొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న నిజాంపేట వాస్తవ్యులు..



**నిజాంపేట,అక్టోబర్12(సూర్యరేఖ)**మండల కేంద్రానికి చెందిన శ్రీవినాయక,దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం విజయవాడ కనకదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రానున్న స్థానిక ఎన్నికలలో యువత పోటీలో నిలబడాలని,గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఆ దుర్గమ్మవారిని కోరుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు బజార్ రంజిత్ గౌడ్,వినయ్ గౌడ్,నాయిని లక్ష్మణ్,జీడి చంద్రకాంత్ గౌడ్,కార్యదర్శి ప్రశాంత్ గౌడ్,తదితరులు ఉన్నారు.

## చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసిన నేర్ధం భాస్కర్ గౌడ్



**ఉప్పల్,అక్టోబర్12 (సూర్యరేఖ)** ఉప్పల్ లోని బీరప్పగడ్డ కేంద్రంలో ఏర్పాటుచేసిన పల్స్ పోలియో కేంద్రంలో నేర్ధం బాలయ్య భాగ్య లక్ష్మి సేవా సంస్థ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నేర్ధం భాస్కర్ గౌడ్ చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పోలియో అనే మహమ్మారిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా పాలుపంచుకోవాలని ఒక్క చిన్నారికి కూడ పోలియో చుక్కలు మిస్సవకుండా చూసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అనురాధ,వారిని బృందం,చిన్నపిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ అంజలి నిమ్బల్కర్ కి స్వాగతం పలికిన ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్





**ఉప్పల్,అక్టోబర్12(సూర్యరేఖ)**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నూతన డిసిసి అధ్యక్ష, నియామకం కొరకు ఏఐసీసీ నియమించిన జిల్లా పరిశీలకురాలు అంజలి నింబల్కర్ జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ స్వాగతం పలికారు. మేడ్చల్‌లోని జిల్లా పార్టీ డిసిసి నియామకం కోసం ఆసక్తి కల్పించిన వారి నుంచి బయోడేటాలను పరిశీలించారు. అనంతరం జిల్లా ముఖ్య నాయకులతో ముఖాముఖిగా అంజలి నింబల్కర్ నిర్వహించారు. కార్యక్రమంలో పిసిసి ఆర్గనైజర్లు,మహబూబాద్ పార్లమెంట్ మెంబర్ బలరాం నాయక్ మేడ్చల్ జిల్లా యోజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక అజయ్,ఇంచార్జ్ సురేష్ మేడ్చల్ నియోజకవర్గం అధ్యక్షులు తోటకూర రాహుల్, ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్,మల్కాజ్గిరి అధ్యక్షులు సాయిచరణ,కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు మూవీస్,హబ్సిగూడ డివిజన్ అధ్యక్షులు వాసు నాయక,తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం





## మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయికిరణ్ గౌడ్

**ఉప్పల్,అక్టోబర్12(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో మల్లాపూర్ డివిజన్ లోని మల్లికార్జున్ నగర్ కాలనీ లోని నూతన బాక్స్ డ్రెన్ లైన్,కు సుమారు రూ.60 లక్షల నిధులు మంజూరైన సందర్భంగా మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయికిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంతురి రాజుగౌడ్,మక్తల బాలరాజ్, పర్వతాలు ముజీబ్ జానీ భాయ్ శ్రీనివాస్ ఎస్వి. కిట్టు ధనంజనేయులు ఫసీదుదెన్ సతీష్ శైలజ, సోనీ సాయి టిల్లు,మధు యాదవ్ ప్రణీత్ రెడ్డి,వినేష్ యాదవ్ ఫారుజ్ యూత్ కాంగ్రెస్ నాయకులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# నిర్దేశిత వైద్య సేవలు ప్రజలకు సకాలంలో అందించాలి





**కొల్చారం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసిన.. కలెక్టర్ రాహుల్ రాజ్..**

**కొల్చారం,అక్టోబర్12(సూర్యరేఖ)** నిర్దేశిత వైద్య సేవలు సకాలంలో ప్రజలకు అందించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్యాధికారులను ఆదేశించారు. కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజర పట్టిక, మందుల స్టాక్ రిజిస్టర్ ఆసుపత్రి పరిసరాలు పరిశీలించి వైద్యాధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల కేసులు వాటికి సంబంధించిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా.. సీజనల్ వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,సబ్ సెంటర్ లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా అవసరమైన చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్లవేళలా వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు విశేష కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో ఆకుల రవికుమార్..



**కామారెడ్డి,అక్టోబర్12(సూర్యరేఖ)** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సారంపల్లి గ్రామానికి చెందిన మాజీ కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాసేవ చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. శనివారం సరెంపల్లె గ్రామంలో వాటర్ ట్యాంక్,కు నడిచే మోటర్ పైప్ లైన్ లీకేజీ కావడంతో మాజీ కౌన్సిలర్ స్పందించి తన సొంత డబ్బులతో కొత్త పైపు తెచ్చి పైప్ లైన్ బిగించి ప్రజలకు త్రాగునీరు అందించారు. ఆకుల రూప రవికుమార్ చేసిన పనికి సారంపల్లి గ్రామ ప్రజలు రవికుమార్ అభినందించారు. పార్టీలకతీతంగా పనులు చేస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పడుతున్నాడు.

## గీతా హుండై షోరూం..ఆల్వేస్ అరౌండ్ క్యాంప్,ను ప్రారంభించిన నెమలి అనిల్ కుమార్



**ఉప్పల్,అక్టోబర్12(సూర్యరేఖ)**మల్లాపూర్ డివిజన్ మైఫ్లవర్ అపార్ట్మెంట్స్ లో గీతా హుండై షోరూం ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆల్వేస్ అరౌండ్ క్యాంప్"ను గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆదివారం ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో షోరూం జనరల్ మేనేజర్ అబ్దుల్ హామీద్,సర్వీస్ మేనేజర్ మిస్కిన్ పాషా,యాజమాన్య సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల నిండైన జీవితానికి రెండు చుక్కల పల్స్ పోలియో..

గల్లా వినయ్ కిశోర్



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్12(సూర్యరేఖ)** కార్వాన్ ఎంసిహెఫ్ పార్క్ ప్రక్కన గల యూ.పి.హెచ్.సి1 యందు పల్స్ పోలియో కార్యక్రమం డా.శ్రీకాంత్ పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. పల్స్ పోలియో శిభిరంలో చిన్నారులకు పిల్లల నిండైన జీవితానికి రెండు చుక్కల పల్స్ పోలియో అంటూ సిబంది సేవలు అందించారని తెలిపారు. ఈ పల్స్ పోలియో' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఇండియన్ రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్ గల్లా వినయ్ కిశోర్ పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా గల్లా వినయ్ కిశోర్ మాట్లాడుతూ...పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డా.మురళీధర్ వైద్య సిబ్బంది,బస్తీ వాసుల పిల్లలకు సేవలందించారు.

## మొరం మాఫియా పై పోలీసుల ఉక్కుపాదం..




**కామారెడ్డి,అక్టోబర్12(సూర్యరేఖ)**కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం తాడ్వాయి మండల కేంద్రం నుండి గత ఆరు నెలలుగా అక్రమ మొరం దందా కొనసాగుతుంది. మొరం రవాణాపై స్థానిక పోలీసులు దృష్టి సారించారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు థర్డ్ వై సదాశివనగర్ మండలాల పరిధిలో అనుమతులు లేని మొరం వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డి.ఎస్.పి శ్రీనివాసులు కేసు విచారణలో థర్డ్ వై మండలానికి వచ్చిన సందర్భంలో మొరం నవ్వుతున్న ఒక జెసిబితో పాటు దాన్ని తరలిస్తున్న ఒక టిప్పర్ను పట్టుకున్నారు. వాటికి ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకపోవడంతో వాహనాలను అక్కడికక్కడే సీజ్ చేసి పోలీస్ స్టేషన్ ను తరలించినట్టు ఎస్సై మురళి తెలిపారు. సదాశివ నగర్ మండలం వివిధ గ్రామాల్లో నిర్వహించిన తనిఖీల్లో మరో నలుగు మొరం టిప్పర్రు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ పట్టుబడిన వాహనాల్లో ఒకటి అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుడికి సంబంధించినది కాగా మరొకటి ప్రతిపక్ష పార్టీ కార్యకర్తకు సంబంధించినది అని సమాచారం.. అక్రమంగా తరలిస్తున్న అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దాడులతో మొరం మాఫియాలు భయాందోళనలు మొదలయ్యాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉదయం నుండే మొరం టిప్పర్లు నడుస్తుండడంతో ప్రజలకు తీవ్ర అంతరాయం జరుగుతుంది. అధికారులు మాత్రం చూసి చూడనట్టు వదిలేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని కామారెడ్డి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# ప్రేమావతిపేట్ లో పిల్లలకు పోలియో చుక్కల కార్యక్రమం

**ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి..**
**బిజెపి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్**

**రాజేంద్రనగర్,అక్టోబర్12(సూర్యరేఖ)** పోలియో బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసుకునేలా చూడాలని బిజెపి రాజేంద్రనగర్ అసెంబ్లీ బిజెపి మల్లేష్ యాదవ్ పిలుపునిచ్చారు.పల్స్ పోలియోను పురస్కరించుకొని ఆదివారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ ప్రేమావతిపేట్ ప్రభుత్వ పాఠశాలలో బిజెపి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ అంగనవాడి టీచర్లు నాయకులతో కలిసి ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ...0-5 ఏళ్లలోపు పిల్లలకు పోలియోచుక్కలు వేయించాలని పల్స్??పోలియో కార్యక్రమం అనేది మన దేశ ఆరోగ్య రంగంలో ఎంతో ముఖ్యమైన కార్యక్రమ న్నారు.భారతదేశాన్ని పోలియోరహితంగా



మార్చేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ఎన్నో ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమం ద్వారా మనం చిన్నారులకు జీవితాంతం ఆరోగ్యాన్ని అందించగలుగుతామని,తమ పిల్లల భవిష్యత్తును కాపాడాలంటే ఈ రెండు చుక్కలు తప్పనిసరిగా



వేయించాలన్నారు.మన పిల్లల పట్ల ఇది మన బాధ్యత మాత్రమే కాదు ఒక సామాజిక బాధ్యత కూడా అని గుర్తుచేశారు.పోలియోని పూర్తిగా నిర్మూలించాలంటే మనం అందరం కలిసి పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ వినోద,ఆశా వర్కర్ ఉమారాణి,సురేష్ ముదిరాజ్,భవానిదాస్,ఎడ్లకాడి రవి,తదితరులు పాల్గొన్నారు

## మాజీ ఎంపీపీ కుటుంబ సభ్యులకు పలువురి పరామర్శ..



**మందమర్రి,అక్టోబర్12(సూర్యరేఖ)** ఇటీవల తన తండ్రిని కోల్పోయిన మండల పరిషత్ మాజీ అధ్యక్షులు బొలిశెట్టి కనకయ్య కుటుంబాన్ని పలువురు పరామర్శించారు.తన తండ్రి చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందగా,ఆదివారం దశ దిన కర్మను పురస్కరించుకొని మండలానికి చెందిన పలువురు ఆయనను,కుటుంబ సభ్యులను పరామర్శించి చంద్రయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పట్టణం, మండలంలోని అధికారులు,వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు,ఎంపిటిసి సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించారు.

## నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి



**రాజేంద్రనగర్,అక్టోబర్13(సూర్యరేఖ)**మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాస్త్రీపురంలో ఓవైసీ హిల్స్ లో విషాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న నాలుగో అంతస్తు భవనంపై నుంచి కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇస్మాయిల్ అలీ కుమారుడు షహజాద్ (19)పోలీస్ స్టేషన్ పరిధిలోని శాస్త్రీపురంలో ఓవైసీ హిల్స్ సాబీర్ ఇంట్లో గృహ నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు.షహజాద్ కు గుట్కాతినే అలవాటు ఉంది.శనివారం రాత్రి పనిచేస్తూ గుట్కా ఉమ్మి వేసేందుకు కిందకు చూసాడు.దీంతో కాలుజారి నాలుగో అంతస్తు నుంచి కిందపడి గాయాలకు గురయ్యాడు.ఇంటి యజమాని సాబీర్ షహజాద్ ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఇంటి యజమాని సాబీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ధ్యానం సర్వ రోగ నివారిణి

**డాక్టర్ రామకృష్ణ**
**నారాయణపేట,అక్టోబర్12(సూర్యరేఖ)**
నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కేంద్రంలో ఆదివారం ఎన్ఎన్ నాయుడు సన్స్ ఫామ్ హౌస్ దగ్గర పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వహించారు.డాక్టర్ రామకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ...ధ్యానం వలన సంపూర్ణ శారీరక ఆరోగ్యం,ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పరస్పర అవగాహన బుద్ధి కుశలత, పనులలో నైపుణ్యం సంకల్పసిద్ధి ఆత్మజ్ఞానం చెడు అలవాటుల నుండి విముక్తి మౌనం ద్వారా వాక్ శుద్ధి జరుగుతుంది. సంకల్ప శక్తి పెరుగుతుంది.మౌనం ద్వారా సమస్యలు ఆరోగ్యం,ప్రాబ్లమ్స్ ఆర్థిక ఇబ్బందులు తట్టుకునే



శక్తి పెరుగుతుంది.ప్రతిరోజు ఎవరి వయసెంత ఉందో అన్ని నిమిషాలు ధ్యానం చేయాలి,క్రమం తప్పకుండ ఉమ్మడి జిల్లా సమన్వయ కమిటీ మెంబర్ డాక్టర్ రామకృష్ణ చక్కగా వివరించారు. ఇట్టి కార్యక్రమానికి ధన్వాడ మండలం కొత్తకోట వనపర్తి మహబూబ్ నగర్, నారాయణపేటల నుండి పిరమిడ్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలీయో చుక్కల పంపిణీలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్



**రాజేంద్రనగర్,అక్టోబర్12(సూర్యరేఖ)**పల్స్ పోలీయో కార్యక్రమంలో చిన్నారులకు తప్పని సరిగా పల్స్ పోలీయో చుక్కలు వేయించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ఏడవ డివిజన్ మాజీ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ అన్నారు.ఆదివారం డివిజన్ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులకు తప్పనిసరిగా పోలియో టీకాలు వేయించాల్సిందిగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

# నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన పట్లోళ్ల కార్తీక్ రెడ్డి





**రాజేంద్రనగర్,అక్టోబర్12(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ శుభ కార్యాలకు రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.కార్తీక్ రెడ్డితో పాటు నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్, కొత్త రాజశేఖర్ రెడ్డి రమేష్ చారి రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అలయ్ బలయ్’బీసీ ఆత్మీయ సమ్మేళనం..



**ముస్తాబాద్,అక్టోబర్13(సూర్యరేఖ)** బీసీలు ఆర్థికంగా,రాజకీయంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆలయ్ బలయ్ బీసీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని స్థానిక జికే వెంచేర్ లో ఏర్పాటు చేసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి మాట్లాడుతూ... మూడు తరాలు మారినా, బీసీల భవిష్యత్తు మరాలే,భారత రాజ్యాంగం లో బీసీల పాత్ర శూన్యం,బీసీలు రాజకీయంగా,ఆర్థికంగా,విద్యలో చాలా వెనుకబడి ఉన్నామని,ఈడబ్ల్యూఎస్ కోటా వల్ల చాలా మందికి ఉద్యోగాలు రాక బీసీ అభ్యర్థులు చాలా వరకు నష్టపోయారని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఈడుగురాల సురేష్,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల పర్శరాములు,బీసీటీఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్,జిల్లా మాజీ అధ్యక్షులు కొండ యాదగిరి,గజ్జెల రాజు లక్ష్మీనారాయణ,బండారి మల్లేశం,బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రవణ్ కుమార్,రాష్ట్ర ఉపాధ్యక్షులు పాకాల శ్రీకాంత్,కదిరే సత్తయ్యగౌడ్ రామ్ గోపాల్, చెవుల మల్లేశం కృష్ణహరి,తుమ్మ రాజేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సౌతాఫ్రికాతో తొలి టెస్ట్.. రాణించిన పాక్ బ్యాటర్లు



రెండు టెస్ట్‌లు, మూడు టీ20లు, మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ల కోసం సౌతాఫ్రికా జట్టు పాకిస్తాన్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా ఇవాళ (అక్టోబర్ 12) తొలి టెస్ట్ మొదలైంది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో పాకిస్తాన్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి రోజు పాక్ బ్యాటర్లు తలో చేయి వేయడంతో పాక్ మంచి స్కోర్ సాధించింది. ఆట ముగిసే సమయానికి పాక్ 5 వికెట్ల నష్టానికి 313 పరుగులు చేసింది. పాక్ ఇన్నింగ్స్‌లో నలుగురు అర్ద సెంచరీలు చేశారు. ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్ (93) తృటిలో సెంచరీ మిస్ కాగా.. కెప్టెన్ షాన్ మసూద్ (76), వికెట్ కీపర్ మొహమ్మద్ రిజ్వాన్ (62), సల్మాన్ అఘా (52) బాధ్యతాయుతమైన అర్ద సెంచరీలు చేశారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి రిజ్వాన్, సల్మాన్ అఘా క్రీజ్‌లో ఉన్నారు. పాక్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (2), సౌద్ షకీల్ (0) పూర్తిగా నిరుత్సాహపరచగా.. బాబర్ ఆజమ్ (23) మంచి ఆరంభం లభించినా భారీ స్కోర్‌గా మలచలేకపోయాడు. సౌతాఫ్రికా బౌలర్లలో సెనురన్ ముత్తుసామి 2, రబాడ, ప్రెనెలన్ సుబ్రాయన్, సైమన్ హార్మర్ తలో వికెట్ తీశారు.

# ఐదేళ్లలోపుచిన్నారులకు పల్స్ పోలీయో చుక్కలు వేయించాలి





**రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్**
**రాజేంద్రనగర్,అక్టోబర్12(సూర్యరేఖ)**పల్స్ పోలీయో చుక్కలు ఓ నిండు జీవితానికి ఎంతో కీలకమని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు.ప్రకాష్ గౌడ్ అన్నారు.ఆదివారం పల్స్ పోలీయో చుక్కల కార్యక్రమాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ గణేష్ నగర్ లో నిర్వహించిన పల్స్ పోలీయో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారులకు పల్స్ పోలీయో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోలీయోను నివారించేందుకు ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలీయో చుక్కలు వేయించాలన్నారు.ఈ మేరకు చిన్నారుల తల్లిదండ్రులు పోలీయో చుక్కలు వేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధనంజయ గట్టయ్య వివేక్,లక్ష్మయ్య గుప్తా సత్యనారాయణ శ్రీనివాస్ అంగన్వాడి టీచర్లు, వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎఫ్‌లకు తగ్గుతున్న గిరాకీ.. ఈక్విటీల్లోకి క్షీణిస్తున్న పెట్టుబడులు

**న్యూఢిల్లీ :** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పెట్టుబడులు వరుసగా రెండో నెలా పడిపోయాయి. గత నెల సెప్టెంబర్‌లో రూ.30,421 కోట్లకే పరిమితమైనట్టు శుక్రవారం భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) విడుదల చేసిన గణాంకాలు చెప్తున్నాయి. అంతకుముందు నెల ఆగస్టులో ఇవి రూ.33,430 కోట్లుగా ఉండగా.. 9 శాతం దిగజారినైట్టైంది.అయితే జూలైలో ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.42,703 కోట్లుగా ఉండటం గమనార్హం. కాగా, అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు, స్టాక్ మార్కెట్లలో నెలకొన్న తీవ్ర ఒడిదొడుకులు.. ఇన్వెస్టర్లను ప్రభావితం చేస్తున్నాయన్న అంచనాలున్నాయి. యినప్పటికీ ఈక్విటీ స్కీముల్లోకి మ్యూచువల్ ఫండ్స్ నుంచి పెట్టుబడులు రావడం వరుసగా ఇది 55వ నెల అని యాంఫీ తెలిపింది.

# అత్యవసర సేవలకు, అత్యవసరం వచ్చింది స్పందించండి





108 సిబ్బంది వేడుకోలు

**ధన్వాడ,అక్టోబర్12(సూర్యరేఖ)**అత్యవసర సేవలు అందించే అంబులెన్స్ సిబ్బందికే అత్యవసరం అవసరమొచ్చింది..ఆపద వస్తే మేమున్నాం... ఎటువంటి సమయంలో నైనా ఫోన్ వస్తే చాలు మీ ముందు వాలిపోతాం అన్నవారికే ఆపద వచ్చింది..వివరాల్లోకి వెళితే...మండల కేంద్రమైన ధన్వాడలో గత మూడేళ్లుగా అంబులెన్స్ సేవలను నిర్వహిస్తున్నారు.ధన్వాడ తోపాటు చుట్టుముట్టు గ్రామాలకు ఆసుపత్రి పరంగా ఆత్యవసర సేవలు అవసరమొచ్చినప్పుడు ప్రజలు ధన్వాడ 108 అంబులెన్స్ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి ఆసుపత్రి సేవలను వినియోగించుకుంటున్నారు. అయితే విషయమేమంటే 108 అంబులెన్స్ సిబ్బంది నివాసం ఉండడానికి ఓ భవనం కూడా లేదు.దీంతో గత కొన్ని రోజుల నుంచి గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఓ గదిని తీసుకొని నివాసముంటున్నారు ప్రస్తుతం ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తుండడంతో గ్రామపంచాయతీలో ఉన్న రూమును 108 సిబ్బంది కాల్ చేయాల్సిన అవసరం వచ్చేసింది. దీంతో 108 సిబ్బంది ఎక్కడ షెల్టర్ ఉండాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.ఈ విషయంలో రాజకీయ నాయకులు, అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం నివాసం ఉండడానికి రూమ్ లేకపోవడంతో డ్యూటీలో ఉన్న లేడీస్ సిబ్బందికి సైతం ఇబ్బందిగా మారింది. మూడున్నర సంవత్సరాల నుండి ఎమర్జెన్సీ సర్వీస్ అంబులెన్స్ సేవలు అందిస్తున్నారు.కనీసం మాకు ఉండడానికి వసతులు ఉండట్లేదు. ఎక్కడెక్కడో దూరం నుండి టెక్నీషియన్లు డ్రైవర్లు మన మండలానికి సేవలందించడానికి వస్తున్నారు. కానీ ఇప్పటికి 108కు ప్రత్యేక నివాస స్థలం లేదు. కావున చాలా ఇబ్బందికరంగా మారింది.గత మూడు సంవత్సరాలుగా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నాం..ఇప్పుడు ఎలక్షన్ నిబంధనల ప్రకారం అక్కడ రూమ్స్ ఇబ్బందికరంగా ఉన్నాయని,మాకు తెలపడం జరిగింది.కావున మా రూమ్ ఖాళీ చేయడం జరిగింది.విషయంలో అందరు స్పందించాలంటూ 108 సిబ్బంది కోరుతున్నారు.

# పల్స్ పోలీయో చుక్కలను సామాజిక ఆరోగ్య బాధ్యతగా చిన్నారులకు వేయించాలి







మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్

**రాజేంద్రనగర్,అక్టోబర్12(సూర్యరేఖ)**పల్స్ పోలీయో చుక్కలను చిన్నారులకు సామాజిక బాధ్యతగా చిన్నారులకు వేయించాలని మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ బాబుల్ రెడ్డినగర్ లోని మహిళా బిల్డింగ్ లో పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాలలోని పిల్లలకు పోలీయో చుక్కలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రారంభించి,పిల్లలకు పోలీయో చుక్కలు వేశారు.పోలీయో భారీన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పోలీయో చుక్కలు వేసుకునేలా చూడాలని వెంకటేష్ పిలుపునిచ్చారు.0-5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం అనేది మన దేశ ఆరోగ్య రంగంలో ఒక ఎంతో ముఖ్యమైన కార్యక్రమమన్నారు.భారతదేశాన్ని పోలియో రహితంగా మార్చేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా ఎన్నో ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా మనం చిన్నారులకు జీవితాంతం ఆరోగ్యాన్ని అందించగలుగుతామని,తమ పిల్లల భవిష్యత్తును కాపాడాలంటే ఈ రెండు చుక్కలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు.మైలార్ దేవ్ పల్లి డివిజన్ లో ఒక్కో కుటుంబం,ఒక్కో చిన్నారి కూడా ఈ కార్యక్రమం నుంచి మిగలకుండా ఉండాలన్నారు. మన పిల్లల పట్ల ఇది మన బాధ్యత మాత్రమే కాదు ఒక సామాజిక బాధ్యత కూడా అని అన్నారు.ప్రభుత్వం,ఆరోగ్యశాఖ ఈ కార్యక్రమాన్ని ఎంతో విస్తృతంగా చేపడుతోందన్నారు.ప్రభుత్వ హాస్పిటల్స్ అంగన్వాడీ కేంద్రాలు,స్కూల్స్,బస్ స్టేషన్లు కాలనీలు ఇలా ప్రతి చోట కూడా పోలియో బూత్‌లు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ టీచర్స్ లక్ష్మీ,అనిత,ఆశ వర్కర్స్ రేణుక,లక్ష్మి,బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్ పోతురాజు మల్లేష్,నరసింహ నరసింహ్మ భీమా రాయుడు నరేష్,బొంబాయి రవి,ఋషి,రెనాల్ట్ కుమార్ అమర్ శివపొట్టి కార్యకర్తలు మహిళలు చిన్నపిల్లలు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులను ప్రోత్సహించేలా ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి పోటీలు







రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్

**రాజేంద్రనగర్,అక్టోబర్12(సూర్యరేఖ)** విద్యార్థులను ప్రోత్సహించాలనే గొప్ప ఉద్దేశ్యంతో ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు. 69వ ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి టోర్నమెంట్స్ విజేతలకు బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన జీహెచ్ఎం భూక్య శ్రీను నాయక్,పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి,జోనల్ స్థాయి కార్యదర్శి గాంగ్యనాయక్ లతో కలిసి పాల్గొన్నారు.పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతి ప్రధానం చేశారు.ఈ టోర్నమెంట్స్ మొయినాబాద్ రాజేంద్ర నగర్ గండిపేట శంషాబాద్ మండలాలకు చెందిన ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మండల స్థాయిలో ఎన్నికైన వారు పాల్గొన్నారు. వాలీబాల్ కబడ్డీ ఖోఖోలలో మొత్తం 48టీంలు పాల్గొన్నాయి. క్రీడలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు.జిల్లా స్థాయి పోటీలు మంగళవారం నుంచి జరుగుతాయని జోనల్ కార్యదర్శి గాంగ్యనాయక్ వివరించారు.ఈ ముగింపు కార్యక్రమానికి మండలంలోని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు కడుమూరి సుదర్శన్ టీజీ పేట వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి పీడీలు జ్యోతి బాల స్వామి రెడ్డి జ్యోత్స అనిత రాణి రామకృష్ణ పుష్ప నిర్మల తిరుపతయ్య నర్సింహా చారి పద్మ సఫియా సుల్తానా వివిధ పాఠశాలల పీడీలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షులపై కసరత్తు



**మహబూబ్‌నగర్:** బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ రద్దుతో ఆశావహుల్లో నైరాశ్యం అలుముకుంది. ఇదే క్రమంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై కాంగ్రెస్ ఫోకస్ పెట్టడం.. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న డీసీసీ అధ్యక్ష పీఠాల భర్తీకి కసరత్తు ప్రారంభించడంతో పార్టీలో మళ్లీ సందడి మొదలైంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల ఖరారుకు సంబంధించి ఏఐసీసీ పరిశీలకులుగా నియమితులైన వారు జిల్లాల బాట పట్టారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిశీలకుడు కర్ణాటక ఎమ్మెల్సీ నారాయణస్వామి శనివారం పాలమూరుకు చేరుకున్నారు. ముందుగా నారాయణపేటలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఆ తర్వాత మహబూబ్‌నగర్‌కు చేరుకుని స్థానిక నేతలతో ముచ్చటించారు. ఆదివారం నుంచి ఈ రెండు జిల్లాల్లో అభిప్రాయాల సేకరణతో పాటు డీసీసీ అధ్యక్షుల ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. అదేవిధంగా మరో పరిశీలకుడు పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి ఆదివారం నాగర్‌కర్నూల్, 14న వనపర్తి, 16న జోగుళాంబ గద్వాలలో పర్యటించనున్నారు.

**నవంబర్‌లో ఖరారయ్యే అవకాశాలు**

ఏఐసీసీ పరిశీలకులు ఆయా జిల్లాల్లో పర్యటిస్తూ డీసీసీ అధ్యక్షులుగా ఎవరిని నియమిస్తే బాగుంటుందని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించనున్నారు. అదేవిధంగా అధ్యక్ష పదవులను ఆశిస్తున్న నేతల నుంచి ఈ నెల 18వ తేదీ దాకా దరఖాస్తులు స్వీకరించనున్నారు. వడబోత తర్వాత ఒక్కో జిల్లాకు ఆరుగురి పేర్లతో ఈ నెల 22వ తేదీ నాటికి అటు ఏఐసీసీ, ఇటు పీసీసీకి అందజేయనున్నారు. అనంతరం సీఎం ఇతర ముఖ్య నేతలు జిల్లా ఇన్‌చార్జిలు, ఇన్‌చార్జి మంత్రు లు, ఆయా జిల్లాల నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతిని ధ్యం వహిస్తున్న మంత్రులతో సంప్రదింపులు జరి పి సామాజిక వర్గాల (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్, మహిళ) వారీగా పార్టీ జిల్లా అధ్యక్ష పదవులను కేటాయించనున్నారు. మొత్తానికి వచ్చే నెల తొలివారంలో డీసీసీ అధ్యక్షులు ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఆశావహులు తాము చేసిన దరఖాస్తుల్లో పార్టీకి అందించిన సేవలు, అనుభవం, గతంలో నిర్వర్తించిన బాధ్యతలు తదితర వివరాలను స్పష్టంగా పేర్కొంటూ బయోడేటా ఇవ్వాలని పరిశీలకులు సూచిస్తున్నారు.

**జిల్లాల వారీగా పోటాపోటీ ఇలా..**

మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి డీసీసీ చీఫ్‌గా ఉన్నారు. ఆయనతో పాటు ఈ పదవి కోసం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ వెంకటేష్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ ప్రధానకార్యదర్శి సిరాజ్‌ఖాద్రి పోటీపడుతున్నారు. వనపర్తి జిల్లాకు సంబంధించి ప్రధానంగా ముగ్గురి మధ్య పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. లక్కాకుల సతీష్, రాజేంద్రప్రసాద్, డి.కిరణ్ కుమార్ డీసీసీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో మూడు వర్గాల మధ్య డీసీసీ పదవికి పోటీ నెలకొంది. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వర్గంలోని గద్వాలకు చెందిన గడ్డం కృష్ణారెడ్డి, మల్దకల్ మండలానికి చెందిన పటేల్ ప్రభాకర్‌రెడ్డి.. జెడ్పీ మాజీ అధ్యక్షురాలు సరిత భర్త తిరుపతయ్య, మల్దకల్‌కు చెందిన నల్లారెడ్డి పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఏఐసీసీ నాయకుడు సంపత్‌కుమార్.. సరిత వర్గంలోని నల్లారెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఉన్నారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్ష పదవిపై పార్టీ మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు హబీబ్, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్‌కుమార్ రెడ్డి, కొల్లాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాము యాదవ్ ఆశలు పెట్టుకున్నట్లు తెలిసింది. నారాయణపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి ఉన్నారు. మరికల్ మండలం తీలేరుకు చెందిన ఆయనతో పాటు మక్తల్ మండలానికి చెందిన బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ధన్వాడ మండలంలోని గోటూరు నాగేశ్వర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలానికి చెందిన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్నరెడ్డి, కోస్గి మండలం పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మద్దూరు మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి సైతం డీసీసీ పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

## క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి.. వెల్నెస్ ఎండీ సుమన్ గౌడ్



**నిజామాబాద్ :** క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని వెల్నెస్ ఎండీ సుమన్ గౌడ్ సూచించారు. క్యాన్సర్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వెల్నెస్ హాస్పిటల్స్, ఇండోర్ క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పుల్లాంగ్ నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యులు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి వెల్నెస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతతో ఈ ర్యాలీ నిర్వహించామని, క్యాన్సర్ ను మొదటి దశలోనే గుర్తిస్తే అరికట్ట వచ్చని, ఒకవేళ క్యాన్సర్ కు గురైన వారిని కూడా నేటి ఆధునిక వైద్య టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ చికిత్స ద్వారా కొందరు మేలుకున్న సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. అలాగే ఈ ర్యాలీకి సహకారం అందించిన రోటరీ క్లబ్, లైన్స్ క్లబ్, యూబీ హెూటల్ మేనేజ్మెంట్ విద్యార్థులు, మెడికల్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని విజయవంతం చేశారని వారు అన్నారు. అలాగే వెల్నెస్ ఆస్పత్రి ద్వారా జిల్లా ప్రజలకు గొప్ప అవకాశం కల్పిస్తున్నట్లు, అలాగే వెల్నెస్ హాస్పిటల్‌కు వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఆసుపత్రి యాజమాన్యం తరపున రూ.50 వేల విలువ గల ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డును తమ ఆసుపత్రికి వచ్చే వైద్యులు తమ ఆధార్ కార్డు ఆస్పత్రిలో చూపిస్తే ఉచిత హెల్త్ కార్డు అందివ్వనున్నట్లు తెలిపారు. ఈ సువర్ణ అవకాశాన్ని జిల్లాలోని పేద, మధ్య తరగతి ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. భవిష్యత్‌లో కూడా వెల్నెస్ ఆస్పత్రి ప్రజలకు అందుబాటులో ఉంటూ ముఖ్యంగా నిరుపేదలకు మెరుగైన వైద్య అందించడంతో పాటు వారి చికిత్సలో రాయితీని కూడా కల్పిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్నెస్ ఆసుపత్రి ఎండీ సుమన్ గౌడ్, ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ బోదు అశోక్, ఆసుపత్రి వైద్యులు పొద్దుటూరి కౌశిక్, నాగ నాయక్, ప్రశాంత్ రెడ్డి, కిరణ్ కేతావత్, ఆసుపత్రి జనరల్ మేనేజర్ అరవింద్ తోపాటు వెల్నెస్ ఆస్పత్రి సిబ్బంది, ఇందూర్ ఆసుపత్రి హెడ్ డాక్టర్ అమర దీపిక, డాక్టర్ అరవింద్, డాక్టర్ చైతన్య, యూవీ హెూటల్ మేనేజ్మెంట్ కాలేజ్ నిర్వాహకులు సృజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల భవిష్యత్ కోసం..2 పోలియో చుక్కలు





**చిన్నారులకు పల్స్ పోలీయో చుక్కలను తప్పనిసరిగా వేయించాలి..**
**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,అక్టోబర్12(సూర్యరేఖ)** చిన్నారులకు పల్స్ పోలీయో కార్యక్రమం ద్వారా వేస్తున్న పోలీయో చుక్కలను వేయించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఆదివారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలీయో కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు పిల్లలకు పోలీయో చుక్కలను వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఐదేళ్లలోపు పిల్లలందరికీ వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలీయో చుక్కలు వేయించాలన్నారు.తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించడంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు.పోలియో చుక్కలు చిన్నారులకు శ్రీ రామ రక్షయని,తప్పక ఈ అవకాశాన్ని సద్విని యోగ పరుచుకుని తమ చిన్నారులకు విధిగా వేయించాలన్నారు. ఆరోగ్య భారత్‌ను నెలకొల్పేం దుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించా లని తోకల శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్,హెచ్ఈఓ కేశవ్ సిస్టర్ చంద్రకళ రావుల భాస్కర్,చెన్ రెడ్డి బుచ్చిరెడ్డి బబ్లూ మజర్ రమేష్ రెడ్డి,ఎన్ను శంకర్ రెడ్డి,అంగన్వాడీ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఇంధన్ పెల్లి అటవీ శాఖ అధికారి సస్పెండ్..వీదుల్లోనిర్లక్ష్యమా.?








**స్మగ్లర్ల పై అవగాహన లోపమా.?**

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా,అక్టోబర్12(సూర్యరేఖ)** జన్నారం మండలం ఇంధన్ పెల్లి అటవీశాఖ అధికారి శ్రీధర్ ఆచారిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.కవ్వాల్ పాలగోరి ప్రాంతాలలో పెద్ద మొత్తంలో టేకు చెట్లు నరికివేతకు గురి కావడం వలన క్రింది స్థాయి అధికారులపై విధులపై క్రమశిక్షణ లేకపోవడంతో ఏకంగా ఆఎఫెక్ట్ ఇందంపల్లి ఎఫ్ఆర్ఓపై పడినట్లు తెలుస్తుంది. ఆటేకు చెట్ల నరికివేత పై విచారణ జరిపించిన ఉన్నత అధికారులు ఆదివారం ఇందన్పెల్లి ఎఫ్ఆర్ఓ శ్రీధర్ ఆచారిని సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.ఇక్కడ గతంలో పనిచేసిన ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ రాత్రానక పగలనక కిందిస్థాయి మరియు బేస్కాంప్ సిబ్బందితో అటవీకి కాపలాదారుడుగా ఉంటూ అడవి నుండి కలపనే కాకుండా ఇసుక రవాణాను కూడా పెద్ద మొత్తంలో అడ్డుకోగలిగారు. అలాంటి నిజాయితీగా పని చేసినటువంటి ఎఫ్ఆర్ఓ పై కొంతమంది కక్షగట్టి ఇతడు ఇక్కడి నుండి వెళ్ళిపోతే అక్రమాలకు మా అధికారం ఉంటుందన్న కక్షతో ఉన్నత అధికారులపై లేనిపోని నిందలు మోపి అతనిని ఇక్కడి నుండి బదిలీ చేయించారు.ప్రమోషన్ పొందినటువంటి శ్రీధర్ ఆచారి మొదటి పోస్టింగ్ ఇంజన్ పెల్లిలో తీసుకోగా అతనికి ఈ అడవి పై అవగాహన లోపమా.!లేక పాలగోరి ఇలా గుడిసెలో తొలగించడంలో దాని పైననే ఎక్కువ ఫోకస్ పెట్టడం వల్ల ఆక్రమార్కులకు ఇది ఒక అవకా శంగా దొరికినదా..!లేక కిందిస్థాయి అధికారులు మామూళ్లకు మరిగి ఎఫ్ఆర్ఓలకు తెలియకుండా స్మగ్లర్లతో చేతులు కలపారా.! అనే పలు అనుమానాలు రేపిస్తున్నాయి.కొత్తగా వచ్చినటు వంటి ఎఫ్ఆర్ఓలు పాలగోరీల గుడిసెల ప్రాంతం లో వారిపై చర్యలు తీసుకుంటూ ఆ పనిలో బిజీగా ఉండగా అక్రమార్కులకు కలప రవాణాకు మంచి అవకాశం దొరికినట్లు ఉందన్న ఆరోపణాలు వినిపిస్తున్నాయి.కొత్తగా వచ్చినటువంటి ఎఫ్ఆర్ఓ శ్రీధరచారికి ఇక్కడ ఉన్నటువంటి అడవి ప్రాంతం పైన అవగాహన లేదా..కిందిస్థాయి అధికారులు ఏ విధమైన డ్యూటీ నిర్వహిస్తున్నారన్న వాటిపై దృష్టి పెట్టలేదా.. కిందిస్థాయి అధికారులు తప్పుదెల వలన ఎఫ్ఆర్ఓపై వేటు పడిందా అనే పలు అనుమానాలు పలువురు రేకిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి జన్నారంలో పలు ప్రాంతాలలో రాత్రనక పగలనక భారీ మొత్తంలో కలప మగ్లింకు గురవుతుంద న్నట్టు ఆరోపణలు వినిపిస్తుండటంతో ఇంజన్ పెల్లి కబాడీ టైగర్ జోన్ లాంటి ప్రాంతాలకు కారం శ్రీను వాస్ లాంటి కఠినంగా డ్యూటీ చేసేటటువంటి అధికారులే ఇక్కడ మెదల కలుగుతారని వాస్తవాలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని ఇంజన్ పెల్లి రేంజ్ ఆఫీసుకు పూతవేటు దూరంలో టేకు చెట్లు నరికివేతకు గురి కావడం ఇంజన్ పెల్లి దేవుని కూడా కవ్వాల్ నుంచి భారీ మొత్తంలో బుల్లేరా వాహనాలలో కడప ఇతర జిల్లాలకు స్మగ్లింకు గురవడం,దీనిలో కొంతమంది కింది స్థాయి అధికారులు స్మగ్లర్లతో చేతులు గలపారన్న ఆరోపణాలు వినిపిస్తున్నాయి.

# 'ఇందిరమ్మ'కు ఉపాధిహామీ


**కై లాస్‌నగర్:** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఆ శించిన స్థాయిలో ముందుగుసాగడం లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం లబ్ధిదారులకు ఆర్థికభారం త గ్గించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ స్కీంకు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చే సింది. తాజా నిర్ణయంతో జాబ్‌కార్డు కలిగిన కూ లీలకు అదనపు ప్రయోజనం కలిగి ఆర్థిక సాంత్వన చేకూరనుంది. సర్కారు నిర్ణయంపై ఇందిరమ్మ లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇందిరమ్మ పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి ప్రభుత్వం 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులకు రూ.5లక్షల చొప్పున చెల్లిస్తోంది. ఇళ్ల నిర్మాణ దశలను అనుసరించి బిల్లులు చెల్లించనుంది. బేస్మెంట్ దశలో రూ.లక్ష, గోడల నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష, స్లాబ్ లెవల్ వరకు పూర్తయితే రూ.2లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తిస్థాయిలో జరిగాక రూ.లక్ష చొప్పున నాలుగు విడతల్లో అందజేస్తోంది. లబ్ధిదారులు ఆర్థి కంగా ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.లక్ష చొ ప్పున తక్షణమే ఆర్థికసాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానించాలని నిర్ణయం తీసుకుంది. తద్వారా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని భావిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేసింది. ఉపాధి కూలీలకు 90రోజుల పనిదినాలు కల్పించాలని నిర్ణయించింది. రోజుకు రూ.307 చొప్పున 90రోజుల పనిదినాలకు గాను రూ.27,630 వారికి అదనంగా లబ్ధి చేకూర్చాలని భావిస్తోంది. అయితే బేస్మెంట్ స్థాయి వరకు 40 రోజులు, లెంటల్ స్థాయి వరకు 30 రోజులు, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మరో 20రోజుల పాటు పని కల్పించనుంది. ఒకవేళ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే బేస్మెంట్ వరకు నిర్ణీత 90రోజుల పనిదినాలు పూర్తయితే మిగతా పనిదినాలను వచ్చే ఆర్థికసంవత్సరంలో ఇచ్చే వెసులుబాటు కల్పించింది. కూలీల వేతనాల చెల్లింపు కోసం నిర్మాణ పనుల్లోని మూడు దశల్లో లబ్ధిదారుడి ఫొటోలు తీసుకుని వాటిని ఆన్‌లైన్‌లో హౌసింగ్‌శాఖ అధికారులు అప్‌లోడ్ చేయనున్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత పంచాయ తీ సెక్రటరీ దాన్ని ధ్రువీకరించినట్లయితే దాని ఆధారంగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో బిల్లులు జమకానున్నాయి. తద్వారా లబ్ధిదారు ఇంటి నిర్మాణాన్ని వేగవంతం చేసుకోవడంతో పాటు కూలీలకు చెల్లించే ఆర్థికభారాన్ని తగ్గించుకోన్నారు.

## టాటా మ్యుచువల్ ఫండ్ యాప్‌లో కొత్త ఫీచర్




న్యూఢిల్లీ: ఈక్వల్-వన్‌మనీ సంస్థతో కలిసి టాటా మ్యుచువల్ ఫండ్ యాప్‌లో పోర్ట్‌ఫోలియో 360 ఫీచరును ప్రవేశపెట్టినట్లు టాటా అసెట్ మేనేజ్‌మెంట్ వెల్లడించింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 సందర్భంగా దీన్ని ఆవిష్కరించింది. వివిధ బ్యాంకు ఖాతాలు, ఫండ్స్, ఈక్విటీలు, ఎఫ్‌డీలు మొదలైన వాటి వివరాలన్నీ ఒకే దగ్గర చూసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ సీఈవో ప్రతీత్ భోబె తెలిపారు. రిటైర్మెంట్‌లాంటి ఆర్థిక ప్రణాళికలు వేసుకునేందుకు ఇన్వెస్టర్లకి సహాయకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశపెట్టిన కొద్ది నెలల్లోనే టాటా మ్యుచువల్ ఫండ్ యాప్ డౌన్‌లోడ్‌లు 6 లక్షల పైగా నమోదైనట్లు వివరించారు. పారదర్శకత, ఆవిష్కరణలపరంగా అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తూ పోర్ట్‌ఫోలియో 360ని తీర్చిదిద్దినట్లు ఈక్వల్%-%వన్‌మనీ వ్యవస్థాపకుడు కృష్ణ ప్రసాద్ తెలిపారు.

## రాబర్ట్ కియోసాకి హెచ్చరిక: ఈ ఏడాదే అతిపెద్ద క్రాష్!




ఎక్స్ వేదికగా పెట్టుబడికి సంబంధించిన విషయాలను పేర్కొంటూ ఉండే.. రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత 'రాబర్ట్ కియోసాకి' మరో ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో.. ఈ ఏడాది అతిపెద్ద క్రాష్ జరుగుతుందని హెచ్చరించారు. ప్రపంచ చరిత్రలో అతిపెద్ద క్రాష్ జరుగుతుందని.. నేను ముందే ఊహించాను. ఆ క్రాష్ ఈ ఏడాది జరుగుతుంది. బేబీ బూమ్ రిటైర్మెంట్లు తుడిచిపెట్టుకుపోబోతున్నాయి. కియోసాకి ప్రకారం.. ఈ ఏడాది స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను పొందే అవకాశం ఉందని, ఇదే అతిపెద్ద క్రాష్ అని స్పష్టంగా అర్థమవుతోంది. స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోవడానికి టారిఫ్స్ ప్రభావం, ఆర్థిక మాంద్యం, అంతర్జాతీయ అనిశ్చితి మొదలైనవి ప్రధాన కారణాలు. డబ్బు కూడబెట్టొద్దు, నిజమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టండని హెచ్చరిస్తూనే ఉన్నాను. చాలా సంవత్సరాలుగా.. నేను సేవర్స్ ఓడిపోయేవారు అని చెబుతూనే ఉన్నాను. చాలా సంవత్సరాలుగా నేను బంగారం, వెండి, బిట్‌కాయిన్ వంటి వాటిలో పెట్టుబడి పెట్టాలని సూచించాను. వాటి ధరలు ఇప్పుడు ఏ స్థాయిలో ఉన్నాయో అందరికీ తెలుసు. ఇప్పుడు ఎథెరియంలను సేవ్ చేయమని చెబుతున్నాను. ఈ రోజు నేను వెండి %డ% ఎథెరియం ఉత్తమమైనవని నమ్ముతున్నాను. ఎందుకంటే వీటి విలువ పెరుగుతూనే ఉంటుంది. వీటిని ముఖ్యంగా పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. దీనివల్ల డిమాండ్ పెరుగుతుంది. దయచేసి వెండి, ఎథెరియం లాభాలు %డ% నష్టాలను మాత్రమే కాకుండా.. ఉపయోగాన్ని కూడా అధ్యయనం చేయండి. మీ సొంత ఆర్థిక జ్ఞానంతో పెట్టుబడి పెట్టండి. ఎప్పటికప్పుడు మీ సొంత ఆర్థిక తెలివితేటలను పెంచుకుంటుంటే.. తప్పకుండా ధనవంతులు అవుతారు. జాగ్రత్తపడండి అంటూ కియోసాకి ట్వీట్ చేశారు.

**పెరుగుతున్న వెండి ధరలు**

బంగారం ధరలు మాదిరిగానే.. వెండి ధరలు అమాంతం పెరుగుతున్నాయి. ప్రస్తుతం భారతదేశంలో కేజీ వెండి రూ. 190000 వద్దకు చేరింది. ఈ సందర్భంగా "వెండి 50 డాలర్లు దాటేసింది, తరువాత 75 డాలర్లకు?.. సిల్వర్, ఎథెరియం హాట్, హాట్" (ధరలు భారీగా ఉన్నాయని) అంటూ కియోసాకి ట్వీట్ చేశారు. దీన్నిబట్టి చూస్తే.. వెండి కూడా మరింత పెరుగుతుందని తెలుస్తోంది.

## ఒకే ఏడాదిలో వెయ్యి పరుగులు.. తొలి బ్యాటర్‌గా చరిత్రకెక్కిన మంధాన!






భారత ఓపెనర్ స్మృతి మంధాన రికార్డుల వెల్లువ కొనసాగుతోంది. భీకర ఫామ్‌లో ఉన్న ఈ లెఫ్ట్ హ్యాండర్ వరల్డ్ కప్‌లో అర్ధ శతకంతో మరో మైలురాయిని అధిగమించింది. ఈ ఏడాది వన్డేల్లో వెయ్యి పరుగులు పూర్తి చేసుకుందీ విధ్వంసక ఓపెనర్. దాంతో, మహిళా క్రికెట్ చరిత్రలో ఒక క్యాలండర్ ఇయర్‌లో ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా కొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ ఏడాది వన్డేల్లో వెయ్యి పరుగులతో ఆస్ట్రేలియా దిగ్గజం బెలిండా క్లార్క్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును బద్ధలు కొట్టిందీ బ్యాటింగ్ క్వీన్. ఆసీస్ వెటరన్ అయిన క్లార్క్ 1997లో 970 రన్స్‌తో చరిత్ర సృష్టించింది. అప్పటినుంచి .. దాదాపు 27 ఏళ్లుగా చెక్కు చెదరని రికార్డును మంధాన బ్రేక్ చేసింది. మొత్తంగా 18 ఇన్నింగ్స్‌ల్లో మంధాన 59.00 సగటుతో 1,062 పరుగులు సాధించింది.

**ఆస్ట్రేలియాపై రెండు సెంచరీలతో**

ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్న మంధాన పరుగుల వరద పారిస్తోంది. వరల్డ్ కప్ ముందే ఆస్ట్రేలియాపై రెండు సెంచరీలతో కదం తొక్కిన ఈ డాషింగ్ బ్యాటర్ మెగా టోర్నీ తొలి రెండు మ్యాచుల్లో నిరాశపరిచింది. కానీ, వైజాగ్‌లో ప్రతీకా రావల్‌తో కలిసి ఆసీస్ బౌలర్లను ఉతికేస్తూ జట్టుకు శుభారంభం ఇచ్చిన మంధాన సెంచరీ ముందు ఔటయ్యింది. లేదంటే.. ఈ ఏడాది నాలుగు సెంచరీలతో రెండో స్థానంలో ఉన్న ఆమె తంజిబ్ బ్రిట్స్ రికార్డును సమం చేసేది. హాఫ్ సెంచరీ తర్వాత వెనుదిరిగిన మంధాన వన్డేల్లో 5వేల పరుగుల క్లబ్‌లో చేరింది.






# కాటాలన్ మూవీ.. పవర్‌ఫుల్ లుక్‌లో హీరో

అంటోని వర్గీస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ "కాటాలన్". క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ నిర్మిస్తున్న ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఇందులో హీరో మాస్ అవతార్‌లో కనిపిస్తున్నాడు. మంటల చుట్టూ సిగరెట్‌తో, కళ్లలో జ్వాలలతో కనిపిస్తున్న అతని లుక్ అదిరిపోయింది. రక్తంతో తడిసిన ముఖం, చేతులు యాక్షన్ ఇన్‌టెన్సిటీని సూచిస్తున్నాయి. పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్ "మార్కో" తర్వాత, క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వస్తున్న సినిమా కావడంతో కాటాలన్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్లుగానే పాన్-ఇండియా కాన్సెప్ట్‌గా భారీ స్థాయిలో నిర్మిస్తునారు. పాల్ జార్జ్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. థాయ్‌లాండ్ యాక్షన్ సన్నివేశాలను ప్రపంచ ప్రఖ్యాత ఒంగ్-బాక్ సిరీస్ యాక్షన్ డైరెక్టర్ కెచా ఖాంఫక్డీ తన టీమ్‌తో కలిసి రూపొందించారు. అదే సిరీస్‌లో నటించిన పాంగ్ కూడా ఈ సినిమాలో కనిపించనుంది. ఈ మూవీకి అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. కాటాలన్ లో తెలుగు నటుడు సునీల్, కబీర్ దుహాన్ సింగ్, రాపర్ బేబీ జీన్, రాజ్ తిరందాసు (పుష్ప ఫేమ్), బాలీవుడ్ నటుడు పార్థ్ తివారి (కిల్ ఫేమ్), అలాగే మలయాళ సినీ నటులు జగదీష్, సిద్ధిక్, వ్లాగర్-సింగర్ హనాన్ షా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను జోబీ వర్గీస్, పాల్ జార్జ్, జెరో జేకబ్ సంయుక్తంగా రాశారు. ఈ మూవీ మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది.



# అదిపోయే లుక్‌లో జాన్వీ!


అందాల ముద్దుగుమ్మ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ బ్యూటీ తాజాగా పింక్ లెహెంగాలో తన అందాలతో గత్తర లేపుతుంది. తన అందాన్ని చున్నీ చాటున దాచి, కొంటె చూపుతో, ప్రతి ఒక్కరి మనసు దోచేస్తుంది. మరి మీరు కూడా ఈ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి. బాలీవుడ్ చిన్నది అతిలోక సుందరి గారాల పట్టీ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. తన అందంతో ఎంతో మంది మదిని దోచుకున్న ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన క్యూట్ అండ్ బ్యూటిఫుల్ ఫొటోస్ షేర్ చేస్తుంటుంది. జాన్వీ కపూర్ ధడక్ సినిమాతో హీరోయిన్‌గా బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమాతో ఈ ముద్దుగుమ్మ తన నటనతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఈ మూవీతో ఈ అమ్మడుకు మంచి క్రేజ్ రావడంతో వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. తక్కువ సమయంలోనే క్రేజీ హీరోయిన్‌గా గుర్తింపు సంపాదించుకుంది. ఇక జాన్వీ కపూర్ జూనియర్ ఎన్టీఆర్ సరసన దేవర సినిమాలో నటించిన విషయం తెలిసిందే. ఈ మూవీతో ఈ బ్యూటీ తెలుగు చిత్రపరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీతో తెలుగులో మొదటి బ్లాక్ బస్టర్ తన ఖాతాలో వేసుకుంది. ఇక సినిమా తర్వాత జాన్వీకి లక్కు కలిసి వచ్చిందనే చెప్పాలి. ఎందుకంటే, ఈ మూవీ తర్వాత వరసగా ఆఫర్స్ క్యూ కట్టడంతో, ప్రస్తుతం ఈ బ్యూటీ వరస సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది. టాలీవుడ్ టు బాలీవుడ్ వరసగా సినిమాలు చేస్తూ ఫుల్ జోష్‌లో ఉంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ రామ్ చరణ్ సరసన ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ, తాజాగా లేత గులాబీ రంగు లెహెంగాలో తన అంద చందాలతో మాయ చేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ ఈ బ్యూటీ తన ఇన్ స్టాలో పోస్ట్ చేయడంతో అవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

# వేణు యెల్దండి 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ నుండి నితిన్ ఔట్.. మరో హీరోతో హిట్ కొట్టే ప్లాన్..!



డైరెక్టర్‌గా వేణు యెల్దండికి భారీ పేరు తీసుకొచ్చిన చిత్రం బలగం. ఆ సూపర్ హిట్ మూవీ తర్వాత ఆయన తెరకెక్కించబోయే కొత్త సినిమా 'ఎల్లమ్మ' పై గత కొంత కాలంగా టాలీవుడ్‌లో భారీ క్రేజ్ నెలకొంది. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్ అధికారికంగా సెట్స్‌పైకి వెళ్లకపోవడం, హీరోయిన్, హీరో ఎంపికపై ఊహాగానాలు చక్కర్లు కొట్టడం మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మించనున్నారు. మొదట్లో 'ఎల్లమ్మ' సినిమాలో యంగ్ హీరో నితిన్ హీరోగా నటించనున్నారని ప్రచారం జరిగింది. దిల్ రాజు స్వయంగా ఒక కార్యక్రమంలో ఇది వెల్లడించారు. అంతేకాదు, నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమా రిలీజ్ అయిన తర్వాతే ఈ ప్రాజెక్ట్ మొదలవుతుందని ప్రకటించారు. అయితే ఇటీవల నితిన్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్టు వార్తలు వెలువడ్డాయి. దీంతో 'ఎల్లమ్మ' లో హీరోగా మరొకరిని తీసుకునే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని టాక్.

నితిన్ స్థానంలో మొదటగా శర్వానంద్ పేరు వినిపించింది. కథ వినిపించగా ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కూడా ప్రచారం జరిగింది. కానీ తాజాగా సోషల్ మీడియాలో కొత్త పేరు హల్‌చల్ చేస్తోంది. అది ఎవరో కాదు ఇటీవల 'కిష్కింధపురి' సినిమాతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఇప్పటికే నిర్మాతలు బెల్లంకొండతో చర్చలు జరుపుతున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ బెల్లంకొండ కాంపౌండ్ లోకి వెళ్లిందన్న వార్తలు వైరల్‌గా మారాయి. మేకర్స్ త్వరలో అధికారిక ప్రకటన చేయనున్నట్టు కూడా సమాచారం. వేణు యెల్దండికి దిల్ రాజు బలమైన సపోర్ట్ అందిస్తున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్‌ను శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై తెరకెక్కించనున్నారని సమాచారం. అన్నీ అనుకున్నట్లే జరిగితే, వచ్చే కొన్ని వారాల్లోనే ఎల్లమ్మ మూవీకి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్, 'టైసన్ నాయుడు' అనే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. డిసెంబర్‌లో ఈ సినిమా విడుదలకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇటీవలే 'కిష్కింధపురి' హిట్ తర్వాత ఆయనకి మళ్లీ క్రేజ్ పెరిగింది. ఇప్పుడు 'ఎల్లమ్మ' లాంటి ఎమోషనల్ కంటెంట్ ఉన్న సినిమాలో ఆయన భాగం కావడం టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయింది. మొత్తానికి 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ ఎవరితో సెట్స్‌పైకి వెళ్తుందనేది అధికారిక ప్రకటన వచ్చేంతవరకూ వేచి చూడక తప్పదు



# మ్ చరణ్ పెద్ది.. డేరింగ్ సీన్ లీక్!

మెగా హీరో రామ్ చరణ్ నటిస్తోన్న స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రంపై మెగా ఫ్యాన్స్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం చెర్రీ సరసన బాలీవుడ్ భామ, దేవర బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా మెప్పించనుంది. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ పుణెలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో ఓ బ్యూటీఫుల్ సాంగ్‌ను తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సాంగ్ షూటింగ్‌కు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. పర్వత ప్రాంతంలో రామ్ చరణ్ స్టెప్పులు వేస్తోన్న వీడియో సోషల్ మీడియాలో లీక్ అయింది. చెర్రీ ఓ రాయిపై నిలబడి డ్యాన్స్ చేయడంపై డేరింగ్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. రామ్ చరణ్ డేరింగ్ డ్యాన్స్ అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. అయితే సాంగ్ షూట్ సీన్ లీక్ కావడం టాలీవుడ్‌లో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ పాటకు ఏఆర్ రెహమాన్ సంగీతమందిస్తుండగా.. జానీ మాస్టర్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ పాట విజువల్ ట్రీట్‌గా ఉంటుందని చిత్రబృందం పేర్కొన్న సంగతి తెలిసిందే. అందుకే పర్వత ప్రాంతాల్లోనే షూటింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు 60 శాతం షూటింగ్ పూర్తయిన ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది.

# సిద్ధు జొన్నలగడ్డ తెలుసు కదా ట్రైలర్.. రిలీజ్‌లో ట్విస్ట్!

టిల్లు హీరో సిద్ధు జొన్నలగడ్డ నటించిన తాజా చిత్రం తెలుసు కదా ఈ సినిమాతో కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ మూవీలో రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం దీపావళి కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. రిలీజ్ తేదీ దగ్గర పడడంతో ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు మేకర్స్. ఈ నేపథ్యంలోనే ట్రైలర్ రిలీజ్ చేసేందుకు రెడీ అయిపోయారు. ఈనెల 12 వైజాగ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కానీ ఊహించని విధంగా ట్రైలర్ రిలీజ్ తేదీపై బిగ్ ట్విస్ట్ ఇచ్చారు. ఈ రోజు ట్రైలర్ రిలీజ్ చేయడం లేదని పోస్టర్ ద్వారా వెల్లడించారు. అక్టోబర్ 13న ఉదయం 11 గంటల 34 నిమిషాలకు ట్రైలర్ రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో సిద్ధు ఫ్యాన్స్ కాస్తా డిస్సాపాయింట్ అవుతున్నారు. కాగా.. ఈ చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.



Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,